'వ్యవసాయ రంగ సంక్షోభం-ప్రత్యామ్నాయ విధానాలు' పై నేడు రాష్ట్ర స్థాయి సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'వ్యవసాయ రంగ సంక్షోభం-ప్రత్యామ్నాయ విధానాలు' అంశంపై గురువారం ఉదయం కర్నూలు బిఎఎస్ కళ్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.పురేంద్ర ప్రసాద్ హాజరవుతున్నారన్నారు. వామపక్ష పార్టీల జిల్లా నాయకులు హాజరవుతున్నారని, జిల్లాలో ఉన్న రైతులు మేధావులు ఈ సదస్సులో పాల్గొనాలని కోరారు. రాష్ట్రంలో రైతన్న అనేక కష్టనష్టాల మధ్య వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నాడని తెలిపారు. ఒకవైపు కరువు అకాల వర్షాలు తుఫాన్లతో పంటలు దెబ్బతింటున్నాయని, మరోవైపు వ్యవసాయ పెట్టుబడులు పెరిగాయి, పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉన్నదని, పండించిన అరకొర పంటలకు కూడా గిట్టుబాటు ధరలు దొరకడం లేదన్నారు. రైతాంగం అప్పుల పాలవు తుందని, ప్రతి రైతు రూ.2 లక్షలకు పైగా అప్పులతో జీవిస్తున్నాడని పేర్కొన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో రైతులను నిండా ఉంచుతున్నాయని విమర్శించారు. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అందు కోసం గురువారం నిర్వహించే సదస్సుకు అందరూ హాజరు కావాలని కోరారు.

సాగు, తాగు నీటి ప్రాజెక్టు కోసం

కదం తొక్కిన రైతులు

- తహశీల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా - వనరులున్నా అభివృద్ధికి నోచని ఆలూరు ప్రాంతం - రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆలూరు

సాగు, తాగునీటి ప్రాజెక్టు కోసం రైతులు కదం తొక్కారు. ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో ఈనెల 9న హాలహర్వి మండలం నిట్రవట్టి గ్రామం నుంచి పాదయాత్ర మొదలైంది. మూడో రోజు బుధవారం పెద్దహోతూరు నుంచి ఆలూరుకు చేరుకుంది. సిఐటియు, ఐద్వా, సిపిఐ నాయకులు మద్దతు తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి రైతుసంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పాదయాత్రగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. ఆలూరు ప్రాంతానికి వనరులున్నా పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోలేదని మండిపడ్డారు. వేదవతి (హగరి) నది నుంచి ఏటా వందల క్యూసెక్కుల నీరు తుంగభద్ర నదిలో కలిసి వృథాగా పోతోందని తెలిపారు. విశ్రాంత ఇంజినీర్ సలహా మేరకు వేదవతి ప్రాజెక్టు ద్వారా 8 టిఎంసిల నీరు నిల్వ చేసుకొని 80 వేల ఎకరాలకు సాగు నీరు, 253 గ్రామాలకు తాగునీరు అందించవచ్చని చెప్పారు. వామపక్షాలు, రైతుసంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు, పాదయాత్రలు, ఆందోళనలు చేపట్టి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళితే గత టిడిపి ప్రభుత్వం రూ.1,925 కోట్లు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నిధులను రూ.1,600 కోట్లకు, నీరు 3.4 టిఎంసిలకు కుదించి ఆర్భాటంగా పైపులైన్ పనులు చేపట్టిందని చెప్పారు. నిధుల్లేక గుత్తేదారు పనులు ఆపేసినట్లు తెలిపారు. ఆగిన ప్రాజెక్టు పనులను ప్రారంభించి నష్టపోతున్న రైతులకు ఎకరాకు రూ.30 లక్షలు, లేదా భూమికి భూమి ఇచ్చి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకటేశులు, రామకృష్ణ మాట్లాడారు. వేదవతి ప్రాజెక్టు పూర్తి చేస్తే జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు జీవనోపాధికి ఢోకా ఉండదన్నారు. నియోజకవర్గ ప్రాంతంలో నీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు లేకపోవడంతో చదువుకున్న యువత ఉపాధి కోసం పక్క రాష్ట్రాలకు వెళ్తున్నా పాలకులకు పట్టడం లేదన్నారు. టమోటా జ్యూష్ ఫ్యాక్టరీ, జింకల పార్కు రైతులకు కలగానే మిగిలిపోయాయన్నారు. మండలంలో అంగస్కల్ గ్రామంలో అప్పులబాధతో రైతు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వ అధికారులు నిద్రపోతున్నారా అని మండిపడ్డారు. ముసానహళ్లిలో తాగేందుకు బోరు నీరు అందిస్తున్నారని తెలిపారు. పట్టణంలోని సిద్ధేశ్వర కాలనీలో 20 ఏళ్లుగా నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి మౌళిక వసతులు కల్పించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ... ఈ ప్రాంత ప్రజల ప్రయోజనం కోసం పోరాడుతున్న రైతుసంఘం నాయకుల వినతిని ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెపి.నారాయణ స్వామి, కృష్ణ, షాకీర్, నాగరాజు, రైతు సంఘం ఆలూరు, హాలహర్వి, హొళగుంద మండల కార్యదర్శులు ఈరన్న, ధనుంజయ, వెంకటేశులు, సిపిఐ జిల్లా నాయకులు భూపేష్, మండల కార్యదర్శి రామాంజనేయులు, ఎఐటియుసి మండల నాయకులు శివ, ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు రత్నమ్మ, షేకున్ బీ, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్, మైనా, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు పోతురాజు, గిరి, రవి, బసవరాజు, హమాలీ సంఘం నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

పాదయాత్రలో పాల్గొన్న రైతుసంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు

గ్రామీణులకు కార్పొరేట్ వైద్యం : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామీణ ప్రాంతాలల్లోని ప్రజలకు ఉచిత కార్పొరేట్ వైద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని కర్నూలు కలెక్టర్ డాక్టర్ జి.సృజన, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. కర్నూలు ఎంపిపి వాసువెంకటేశ్వరమ్మ , మన గ్రామ సర్పంచి విద్యాసాగర్ అధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్‌కు స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఘన స్వాగతం పలికారు. కలెక్టర్, ఎమ్మెల్యే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించి,అక్కడి వైద్యులతో మాట్లాడి, శిబిరానికి వచ్చిన ప్రజలకు చేస్తున్న ఆరోగ్య పరీక్షలను, అందుబాటులో ఉన్న మందులను అడిగి, తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ప్రధాత దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి మాదిరిగానే ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చిన వ్యక్తి మన ముఖ్యమంత్రి అని అన్నారు. అందులో భాగంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష', వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు 24 గంటలు వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపిపి వాసు వెంకటేశ్వరమ్మ అక్కడే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో అంగన్వాడీలు గ్రామాల్లోని గర్భిణీ స్త్రీలకు ఎలాంటి పౌష్టికాహారం ఎన్ని విధాలుగా అందిస్తున్నారో వారిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయం సిబ్బంది వాలంటీర్స్ , వైసిపి నాయకులు ఆశవర్కర్స్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కాయ్..రాజా కాయ్..

- జోరందుకున్న బెట్టింగ్ పర్వం
- ఆర్థికంగా నష్టపోతున్న యువత

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

క్రికెట్ ప్రపంచ కప్ సీజన్ వచ్చిందంటే యువతలో జోరు అంతా.. ఇంతా కాదు. ఆ జోరును బెట్టింగ్ బుకీలు క్యాష్ చేసుకుంటున్నారు. మ్యాచ్‌లో సాగే బంతి బంతికీ పందేలు కాస్తున్నారు. ఐపిఎల్ ప్రారంభం రోజున కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మొదలైన క్రికెట్ బెట్టింగ్ ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ ఊపందుకుంది...

తొలుత క్రికెట్ అంటే మానసికోల్లాసం కోసం, క్రీడా స్ఫూర్తి కోసమే ఆడేవారు. నేడు అది జూద క్రీడగానూ మారిపోయింది. గతంలో పట్టణాలకే పరిమితమైన 'బెట్టింగ్ ఫీవర్' నేడు మండల కేంద్రాలతో పాటు మారుమూల గ్రామాలకూ విస్తరించింది. వ్యవహారమంతా సెల్‌ఫోన్లలోనూ, ఆన్‌లైన్లలోనే సాగుతోంది. ప్రత్యేకంగా సెల్‌ఫోన్లు కొనుగోలు చేసుకుని తమ పేర్లతో లేని సిమ్ కార్డులను యువత బెట్టింగ్ కోసం వినియోగిస్తున్నారు. రూ.100 కాస్తే రూ.150, రూ.200 ఇస్తామంటూ బుకీలు ఆశ చూపి యువతను బెట్టింగ్ ఊబిలోకి లాగుతున్నారు. దాంతో యువత బెట్టింగ్‌లో బిజీబిజీ అయిపోయారు. మ్యాచ్ మొదలవడానికి రెండు, మూడు గంటల ముందే వాట్సప్, మెసేజ్, ఫోన్ కాల్స్, ఇంటర్నెట్‌లో యువత బెట్టింగ్‌ను హోరెత్తిస్తున్నారు. చివరికి సర్వం కోల్పోయి వీధిన పడుతున్నారు. మ్యాచ్ ముగిశాక నగదు పంపిణీలో తేడాలు వస్తుండడంతో విద్యార్థుల్లోనూ, యువతలోనూ గొడవలు తలెత్తి పోలీసు స్టేషన్లలో పంచాయితీల వరకూ వెళ్తుండడం గమనార్హం. బెట్టింగ్ ద్వారా రాష్ట్రంలో రోజుకు రూ.కోట్లు చేతులు మారుతోంది. సాయంత్రమైతే చాలు గ్రామాల్లో ఇదే చర్చ జరుగుతోంది. 'ఈ రోజు ఏ జట్ల మధ్య మ్యాచ్ ఉంది. ఎవరెవరు ఆడుతున్నారు. ఏ జట్టుపై పందెం కాయాలి. ఎంత కాస్తే మనకెంత వస్తుంది' అంటూ యువత ఫోన్లలో సంభాషణలు సాగిస్తున్నారు. పాఠశాల విద్యార్థుల మొదలు వృద్ధుల వరకూ అందరూ ఈ బెట్టింగ్ వ్యవహారంలో పాలుపంచుకుంటున్నారు. మ్యాచ్ ఎవరు గెలుస్తారనే పందెంతో పాటు టాస్ ఎవరు గెలుస్తారన్నదీ నేడు పందెంగా మారిపోయింది. ఈ బంతికి ఎంత స్కోర్ కొడతారనే పందెమూ నేడు అధికంగా సాగుతోంది. తెలియని అమాయక యువత అదృష్టం ఉంటే రూ.లక్షలు సంపాదించుకోవచ్చనే క్షణికావేశంతో బెట్టింగ్ వేసి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రధాన ప్రాంతాల్లో ఉండే బెట్టింగ్ బుకీలు ఆయా ప్రాంతాల వారీగా మధ్యవర్తులను నియమించుకుని వారి ద్వారా బెట్టింగ్ తతంగాన్ని నడిపిస్తున్నారు. స్ట్రైట్, రైసింగ్, 30, 50, ఎస్, ఓకే, డన్ వంటి కోడ్‌లను ఉపయోగిస్తూనే ఈ బెట్టింగ్ అంతా సాగుతోంది. కర్నూలు, ఆదోని, నంద్యాల పట్టణాల్లో లాడ్జీలలో ఈ బెట్టింగ్ తంతు సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో స్కూళ్ల మైదానాల్లో సాయంత్రం పూట యువత చేరి బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. క్షేత్రస్థాయిలో పోలీసులు బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువతకు కౌన్సిలింగ్ ఇవ్వడం కూడా ఎక్కడా కనిపించడం లేదు. బెట్టింగ్ ద్వారా ఓ వైపు బుకీలు రూ.లక్షలు, రూ.కోట్లలో సంపాదిస్తుంటే యువత మాత్రం అప్పు చేసి మరీ బెట్టింగ్ కాస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు. ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయి.

ప్రత్యేక నిఘా బృందాలు

క్రికెట్ బెట్టింగ్ నియంత్రణ కోసం స్పెషల్ బ్రాంచ్‌తో పాటు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేశాం. ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే మా దృష్టికి తీసుకువస్తే కూడా చర్యలు తీసుకుంటాం.

- విజయ శేఖర్, కర్నూలు డిఎస్‌పి.

అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏ.గఫూర్ పిలుపు
- బజారు హమాలీ యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించిన పత్తికొండ ఎమ్మెల్యే

ప్రజాశక్తి -వెల్దుర్తి

వెల్దుర్తి మండల కేంద్రంలో బజార్ హమాలి యూనియన్(సిఐటియు) నూతన కార్యాలయాన్ని బుధవారం పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిమ్మ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నిరంతరం కార్మికులకు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటానని తెలిపారు. కార్మికులు ఇలాంటి కార్యాలయాన్ని నిర్మించుకోవడం శుభ పరిణామం అని తెలిపారు. నూతన కార్యాలయాన్ని నిర్మించుకున్న సిఐటియు సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిగా వచ్చిన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ. గఫూర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అసంఘటిత రంగ కార్మికులు 40 కోట్ల మంది ఉన్నారని తెలిపారు. దేశ జిడిపిలో 20 శాతం కార్మికుల వాటా ఉన్నదని, శ్రమ చేసే ప్రతి కార్మికుడికి సంక్షేమ బోర్డు ద్వారా కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అసంఘటితరంగ హమాలీలు బరువు పనులు చేయటం వల్ల వెన్నెముక, రోగాలు, మోకాళ్ళ అరుగుదల వాటి వల్ల శరీరమే పనిచేయకుండా అంగవికలంగా మారుతున్న కుటుంబాలు ఉన్నాయన్నారు. ఆ కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. కార్మిక కుటుంబాలకు ఇంటి సౌకర్యం , ఉద్యోగ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. హమాలీల సంక్షేమ బోర్డు కోసం, హక్కుల కోసం ఉద్యమించాలని కార్మికులకు సూచించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్ మాట్లాడుతూ వెల్దుర్తి మండలంలో బజార్ హమాలి యూనియన్ పట్టుదల, ఐక్యత, ఇతర కార్మిక వర్గాన్ని ఐక్యం చేసే విధంగా ఈ భవనం ఆదర్శవంతంగా ఉండాలన్నారు. బజారు హమాలీలు క్రమశిక్షణతో ఈ భవనం ఆందోళన ప్రచార కేంద్రంగా స్థానిక కార్మికులు ఉపయోగించుకోవాలన్నారు. సిఐటియు జెండాను సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు ఆవిష్కరించారు. నూతన భవనాన్ని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి ప్రారంభించారు. వెల్దుర్తి మండల వైసిపి ఇన్చార్జి రవి రెడ్డి, ఎంపిపి వెంకట్రామిరెడ్డి, జడ్‌పిటిసి మెంబర్ సుంకన్న, వెల్దుర్తి తహశీల్దార్ శివ రాముడు , సిఐటియు జిల్లా కార్యదర్శిజె. నాగేశ్వరరావు, ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, సిఐటియు వెల్దుర్తి మండల అధ్యక్షులు రాజు, సిఐటియు సీనియర్ నాయకులు గోపాల్, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాముడు, సిపిఎం వెల్దుర్తి పార్టీ శాఖ కార్యదర్శి మారెన్న, బజార్ హమాలి యూనియన్ ఫౌండర్ పెద్ద యేసు, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు అలివేలమ్మ, లలితమ్మ, వెలుగు ఆనిమేటర్ల సంఘం మండల అధ్యక్షురాలు పద్మావతి, కళావతి, విఆర్ఎల సంఘం నాయకులు మద్దమ్మ, కలుగొట్ల హమాలీ యూనియన్ మద్దయ్య, ప్రతాపు, వెల్దుర్తి బజారి హమాలి యూనియన్ నాయకులు చిన్న ఏసు, మల్లీ, సత్యం, మాధులు, పెద్దన్న బద్రి, మున్ని, కృష్ణ, లచ్చి, నూతన భవన ప్రారంభోత్సవానికి బజారు హమాలీల తరపున సానుభూతి పరులు హాజరయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏ.గఫూర్

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

ఉర్దూ యూనివర్సిటీకి సొంతభవనం నిర్మించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఉర్దూ యూనివర్సిటీకి సొంత భవనాన్ని వెంటనే నిర్మించాలని, హాస్టల్ వంటి మౌలిక వసతులు కల్పించాలని ఆవాజ్ కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం ఆవాజ్ నగర కమిటీ గౌరవాధ్యక్షులు ఇస్మాయిల్, అధ్యక్షులు ఇక్బాల్ హుస్సేన్ ఆవాజ్ నగర సహాయ కార్యదర్శి షేక్ అబ్దుల్ నయాం, షేక్ అబ్దుల్ నాసిర్, ఇలియాస్ బాష, తెలుగు పండిట్ షేక్ నిసార్ అహమ్మద్, ఇంతియాజ్ బాష, షేక్ మహబూబ్ బాషాలు ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఉర్దూ యూనివర్సిటీని పరిశీలించారు. వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో గల కర్నూలు నగరం లోని రాష్ట్రానికి తలమానికమైన అత్యధికంగా ముస్లిం మైనార్టీలు ఉన్న కర్నూలు జిల్లాలో రాష్ట్రానికి సంబంధించిన డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ పేరుకు మాత్రమే అలంకారపాయంగా ఉందని, ఏమాత్రం వసతులు కల్పన లేదన్నారు. కనీసం సొంత బిల్డింగ్ కూడా లేదన్నారు. నిర్మాణంలో ఇంకా ఉందని ఉర్దూ యూనివర్సిటీ అంటే ఉర్దూ మాత్రమే బోధిస్తారని, ఇతర భాషలలో బోధించరేమో అనే భ్రమలు ఉన్నాయని, అనేక భాషలో కూడా బోధిస్తారని తెలిపారు. ఉర్దూ యూనివర్సిటీలో ఉన్న స్థానిక సమస్యలు పరిష్కారానికి కావలసిన మార్గాలు టీచింగ్ ,నాన్ టీచింగ్ స్టాఫ్ నిధుల కొరత, మౌలిక వసతుల కొరత ఉందని నాయకులు గుర్తించారు. ఉర్దూ యూనివర్సిటీ పట్ల వైసిపి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్త శుద్ధి లేదన్నారు. కర్నూలు ఎమ్మెల్యేలు హఫీస్ ఖాన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రామ్ భూపాల్ రెడ్డి ,కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ లు ఎందుకు ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకురావడం లేదని ప్రశ్నించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ ఉర్దూ యూనివర్సిటీ పైన శ్రద్ధ పెట్టడం లేదన్నారు. వెంటనే సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అదనపు తరగతి గదులు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి కర్నూలు అగ్రికల్చర్

నవంబర్ 10వ తేదీ లోపు 81 అంగన్వాడీ కేంద్రాల్లో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నాడు-నేడు ఫేజ్-2 పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 92 అంగన్వాడీ కేంద్రాల్లో చేపడుతున్న మరమ్మతులకు సంబంధించి 10 మండలాల్లో పూర్తి అయ్యాయని, మిగిలిన 12 మండలాల్లో కూడా వారం రోజుల్లోపు పూర్తి చేయాలన్నారు. పూర్తి అయ్యాక వాటిని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించాలని అధికారులకు సూచించారు.అదనపు తరగతి గదుల నిర్మాణాలకు సంబంధించి 312 పాఠశాలల్లో 1312 అదనపు తరగతి గదులు నిర్మించడం జరుగుతోందని, ఇందులో బేస్మెంట్ స్థాయిలో ఇంకా 43 ఉన్నాయని, వాటిని త్వరితగతిన తర్వాతి దశలకు తీసుకెళ్లాలని సూచించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ల చేత పనుల పురోగతిని ఫోటో క్యాప్చర్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనులకు సంబంధించిన ఖర్చు వివరాలను ఆన్ లైన్ అప్డేట్ చేయాలన్నారు. సిమెంట్ సమస్య గురించి అధికారులు కలెక్టర్ దష్టికి తీసుకురాగా సిమెంటు కంపెనీల యాజమాన్యాలతో మాట్లాడి నిర్మాణాలకు అవసరమైన సిమెంటును సమకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ జిల్లా జనరల్ మేనేజర్ ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. స్టీల్, సిమెంట్ అవసరాని కంటే ఎక్కువగా ఉంటే అవసరం ఉన్న పాఠశాలలకు బదిలీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎస్ఎస్ఎ పిఒ కె.వేణుగోపాల్, డిఇఒ రంగారెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, పరిశ్రమల శాఖ జిల్లా జనరల్ మేనేజర్ ప్రసాద్, ఐసిడిఎస్ ఇంచార్జి పిడి వెంకట లక్ష్మమ్మ, సంబంధిత శాఖల ఇంజనీర్లు, ఎంఇఒలు, సిడిపిఒలు పాల్గొన్నారు.

యానిమేటర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎపి వెలుగు ఉద్యోగులకు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని హెచ్ఆర్ పాలసీని అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపివిఒఎ ల ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఎపివిఒఎల సంఘం సిఐటియు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక శ్రీకృష్ణదేవరాయ సర్కిల్లో బుధవారం నిరసన తెలిపారు. అనంతరం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సలీం బాషను కలిసి వినతి పత్రం అందజేశారు. ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటేప్ప సుంకన్న , జిల్లా కోశా ధికారి రంగన్న సి.బెలగల్, గూడూరు, కోడుమూరు, వెల్దుర్తి మండలాల నాయకులు కుమార్, మారెన్న, సూరి , పద్మావతి, కోమల లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ చేయాలన్నారు. మూడు సంవత్సరాల కాల పరిమితి సర్కులర్‌ను రద్దు చేయాలన్నారు. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని, మాల్ మార్ట్ మాల్ మార్ట్ విధులు నిర్వహించరాదన్నారు. రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలన్నారు. ఈ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు.

'ఉపాధి'కి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలి

వ్యవసాయ కార్మికసంఘం డిమాండ్
మండల కేంద్రాల్లో ధర్నాలు ,వినతులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో రూ.2 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకటరాముడు డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు ఎంపిడిఒ కార్యాలయం ముందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి సమస్యలపైన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమానికి మండల కార్యదర్శి గోపాల్ అధ్యక్షత వహించారు. కె. వెంకటరాముడు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం పేదలకు ఒక వరం లాంటిదని ఇలాంటి చట్టాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేయాలనే ఆలోచనలు ఉపసంహరించుకొవాలన్నారు. కర్నూలు జిల్లాని కరువు జిల్లాగా ప్రకటించి కుటుంబానికి 200 రోజులు . పనులు కల్పించి, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల అధ్యక్షులు జి.ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి , వెంకటేశ్వర్లు కూలీలు రజియా, అల్మాషా, ఫాతిమా పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను ప్రారంభించాలి

కర్నూలు హాస్పిటల్ : గ్రామలలో ఉపాధి పనులు ప్రారంభించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపుమేరకు ఓర్వకల్లు ఉపాధి ఆఫీసు సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న , మండల నాయకులు మల్లేష్, సలాంబాష, ఆనంద్, రవి, కృష్ణుడు మాట్లాడారు.

పత్తికొండ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి నిరుపేద కుటుంబానికి రెండు వందల రోజులు పని దినాలు కల్పించి, రోజువారి వేతనం రోజువారి వేతనం రూ.600 ఇవ్వాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు దస్తగిరి, నరసన్న డిమాండ్ చేశారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉపాధి కూలీలతో కలిసి కార్మిక సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జూనియర్ అసిస్టెంట్ దస్తగిరికి అందజేశారు.

తుగ్గలి : గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఉపాధి కోసం దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచి నిర్వీర్యం చేయాలనే కేంద్ర ప్రభుత్వం సమాయత్తం అవుతుందని వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు శ్రీరాములు,రంగరాజు అన్నారు. తుగ్గలి ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.


ఓర్వకల్లులో వినతిపత్రం అందజేస్తున్న నాగన్న తదితరులు

ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న వెంకట్రాముడు, తదితరులు

నేడు జెమ్ కేర్ కామినేని హాస్పిటల్స్‌లో ఉచిత ఆర్థరైటిస్ స్క్రీనింగ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరం కొత్త బస్టాండ్ సమీపంలోని జెమ్ కేర్ కామినేని హాస్పిటల్స్‌లో వరల్డ్ ఆర్థరైటిస్ డేను పురస్కరించుకుని గురువారం ఉచిత ఆర్థరైటిస్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించనున్నట్లు ప్రముఖ ఆర్థో పెడిషియన్ డాక్టర్ సివిఎస్.రవిబాబు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వి.చంద్రశేఖర్ తెలిపారు. వారు మాట్లాడుతూ రూ.3000 విలువైన పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్ కన్సల్టేషన్, ఫిజియో తెరపీ కన్సల్‌స్టేషన్, ఎక్స్ రే, బోన్ మినరల్ డెన్సిటీ(బిఎండి), బిఎంఐ స్క్రీనింగ్, బిపి చెక్‌అప్ , షుగర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

13న గుణగండ్లలో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 13న గోనెగండ్ల మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోనెగండ్ల ఎంపిడిఒ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరిస్తామని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

బేస్‌మెంట్ లెవెల్ స్థాయికి రావాలి

టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పది రోజుల్లోపు బిలో బేస్‌మెంట్ లెవెల్ స్థాయిలో ఉన్న 5,400 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్ స్థాయికి తీసుకొని వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హౌసింగ్‌కు సంబంధించి కర్నూలు జిల్లాలో గ్రౌండింగ్ శాతం ఇప్పటివరకు 82 శాతం చేశారని, వచ్చే వారం నాటికి 100 శాతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆప్షన్1,2,3 కింద బిలో బేస్‌మెట్ లెవెల్ స్థాయిలో దాదాపు 5400 ఇళ్లు ఉన్నాయని, పది రోజుల్లోపు నాటికి బేస్‌మెట్ లెవెల్ స్థాయికి తీసుకొని రావాలని కలెక్టర్ ఎంపిడిఒలను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ రీ సర్వేకు సంబంధించి 6,354 స్టోన్ ప్లాంటేషన్ పెండింగ్‌లో ఎల్‌పిఎం జనరేషన్‌ను కూడా నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత మండలాల తహసీల్దార్లను ఆదేశించారు.

బాలికల భద్రతపై సిబెళగల్ కెజిబివిలో అవగాహన

ప్రజాశక్తి-సి బెళగల్

సి.బెళగల్ కెజిబివిలో వైద్యులు హెల్త్ ఎడ్యుకేటర్ ఆదినారాయణ బుధవారం భద్రతపై అవగాహన కల్పించారు. ముందుగా అంతర్జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం ఘనంగా చేపట్టారు. ఇక్కడే బాలికలు బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్ వంటివి, బాల్య వివాహాలు, సామాజిక అవగాహన వంటివి అలవర్చు కోవాలని పేర్కొన్నారు. అలాగే ఉన్నత చదువులు చదివితే భవిష్యత్తు మీదేనన్నారు.

హోళగుందలో విజిలెన్స్ దాడులు

- 73 క్వింటాళ్ల ప్రజా పంపిణీ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - హోళగుంద

అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం

కర్నూలు జిల్లా విజిలెన్స్ అధికారుల దాడుల్లో 73 క్వింటాళ్ల ప్రజా పంపిణీ బియ్యం స్వాధీనం చేసుకున్న సంఘటన బుధవారం హోళగుందలో చోటుచేసుకుంది. విజిలెన్స్ అధికారుల వివరాల మేరకు... సమాచారం మేరకు విజిలెన్స్ సిఐ రామకృష్ణ, ఎస్ఐ హనుమంతయ్య, విజిలెన్స్ తహశీల్దార్ వెంకటనారాయణ కాపు కాశారు. ఆదోనికి చెందిన రాజశేఖర్ అనే వ్యక్తి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించిన పోర్టిఫైడ్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి శివ అనే వ్యక్తి మినీ లారీలో స్థానిక రైస్‌మిల్‌లో డంపు చేస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బియ్యాన్ని ఎక్కడి నుంచి తెచ్చారని ఆరా తీయగా కార్డుదారుల నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పారు. లారీని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించి రైస్ మిల్ ఓనర్‌పై, కొనుగోలు చేసిన ఆదోని రాజశేఖర్‌పై, డ్రైవర్స్‌పై కేసు నమోదు చేయించి, బియ్యాన్ని ఆలూరు ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి భద్రపరిచి సీజ్ చేశారు. నిందితులు కర్నూలు జెసి కోర్టులో 6ఎ కేసును ఎదుర్కోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

‘ఉపాధి’ నిర్వీర్యానికి కుట్ర...

- ‘ఉపాధి’ చట్టాన్ని కాపాడుకుందాం
- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఉపాధి కోసం పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచి నిర్వీర్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, దీనిని ఐక్యంగా తిప్పికొడదామని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ కోరారు. వ్యకాస దేశవ్యాప్త పిలుపు మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. వ్యకాస మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ బాష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీరశేఖర్, వ్యకాస మండల కార్యదర్శి మహబూబ్ బాష మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చాక ఉపాధి హామీ నిధుల్లో భారీ కోతలు విధిస్తున్నారని తెలిపారు. రూ.1.20 లక్షల కోట్లు ఉన్న ఉపాధి హామీ బడ్జెట్ రూ.69 వేల కోట్లకు కుదించారని చెప్పారు. దేశవ్యాప్తంగా పని దినాలు దారుణంగా పడిపోయాయని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టానికి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని, వేతనాలకు ఆధార్‌ను అనుసంధానం చేసే ప్రక్రియను ఆపాలని డిమాండ్ చేశారు. కరువు నేపథ్యంలో 200 రోజుల పని దినాలు, రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. మితిమీరిన రాజకీయ జోక్యంతో చాలా జాబ్ కార్డులు తొలగించారని, అర్హులందరికీ కొత్త జాబ్ కార్డులు ఇవ్వాలని తెలిపారు. ఉపాధి హామీ చట్టంలో అవినీతిని అరికట్టాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ఉపాధి హామీ పరిరక్షణ కోసం జరిగే ఉద్యమంలో ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి అశోక్, వ్యకాస నాయకులు కెపి.రాముడు, లక్ష్మిరెడ్డి, సుధాకర్, రవి, ఏలియా, రాము, రంగస్వామి పాల్గొన్నారు.

ఆస్పరి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బాలకష్ణ అధ్యక్షత వహించారు. వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు, మండల అధ్యక్ష, కార్యదర్శులు రంగస్వామి, మధు రెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు నరసింహులు, వెంకట్రాముడు, రామన్న, రవి, రఘు, ఆటో యూనియన్ నాయకులు రామకృష్ణ, బలరాం, నరసింహులు, చిన్న వీరన్న పాల్గొన్నారు. **పెద్దకడబూరు** ఎంపిడిఒ రామన్నకు వినతిపత్రం అందజేశారు. వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ, రైతుసంఘం నాయకులు పరమేష్, సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, ఉప్పర శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆస్పరిలో మాట్లాడుతున్న కెవి.నారాయణ

మాట వినలేదని భార్యపై కత్తితో దాడి...

- అడ్డొచ్చిన తల్లికి గాయాలు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని శివశంకర్ నగర్‌లో దారుణం చోటుచేసుకుంది. టూ టౌన్ సిఐ శ్రీనివాస్ నాయక్ వివరాల మేరకు... కాలనీకి చెందిన మనోహర్ వృత్తి రీత్యా ఆటోడ్రైవర్. మాట వినడం లేదని ఇంట్లో నిద్రిస్తున్న భార్య భాగ్యలక్ష్మిపై బుధవారం తెల్లవారుజామున కత్తితో గొంతుపై దాడి చేశాడు. గడ్డం కింద గాయం కావడంతో భాగ్యలక్ష్మి కేకలు వేశారు. అక్కడే నిద్రిస్తున్న మనోహర్ తల్లి గంగమ్మ అడ్డొచ్చారు. ఆమెకు కూడా గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం ఇవ్వగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు మనోహర్‌ను అదుపులోకి తీసుకున్నారు. క్షతగాత్రులను ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భాగ్యలక్ష్మి

పునరావాస చట్టం అమలు చేయాలి

- సఫాయి కర్మచారి ఆందోళన్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ర్యాలీ నిర్వహిస్తున్న సఫాయి కర్మచారులు

గ్రామాల్లో సఫారీ కర్మచారి వృత్తి చేసే వారికి పునరావాస చట్టం-2013ను అమలు చేయాలని సఫాయి కర్మచారి ఆందోళన్ రాష్ట్ర కన్వీనర్ పెన్న ఓబులేసు, జిల్లా కన్వీనర్ నారాయణస్వామి కోరారు. బుధవారం గోనెగండ్లలో పంచాయతీ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పంచాయతీ, మున్సిపాలిటీల్లో బహిరంగ మల విసర్జన, సామూహిక వ్యక్తిగత మరుగుదొడ్లను, మురుగు కాలువలు, సెప్టిక్ ట్యాంక్ లాంటి మానవ వ్యర్థాలను మనుషుల చేత శుభ్రం చేయించడం నిషేధమని తెలిపారు. మాన్యువల్ స్కావెంజర్లుగా ఉపాధిని నిషేధించి వారికి 2013 పునరావాస చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వృత్తి అమలులో లేదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఇప్పటికీ చాలామంది ఈ వృత్తిలో కొనసాగుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ పనిలో ప్రమాదాలకు లోనై అనారోగ్యంతో చాలామంది చనిపోతున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా సఫాయి కర్మచారి ఆందోళన్ ‘మమ్మల్ని చంపకండి’ అనే నినాదంతో ప్రచారోద్యమం చేపట్టినట్లు చెప్పారు. సిఐటియు నాయకులు బతకన్న, దేవదాసు, నరసింహుడు, రాజు, మునెప్ప పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయాలి : వ్యకాస

ప్రజాశక్తి- దేవనకొండ

వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రబీ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో బోరుబావులు, సాగునీటి సదుపాయాల కింద ఉన్న రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, మండల కార్యదర్శి మహబూబ్ బాషా, సిఐటియు మండల కార్యదర్శి అశోక్ కోరారు. బుధవారం వ్యవసాయ శాఖాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు నష్టపోయారని, రబీ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దేవనకొండ మండల ప్రాంతంలో అక్టోబర్ మాసంలో విరివిగా వేరుశనగ విత్తనాలు వేస్తారని తెలిపారు. పదును ఉన్న సమయంలో విత్తనాలు వేయడం ద్వారా దిగుబడి వస్తుందని రైతులు ఆశాజనకంగా ఉంటారని చెప్పారు. ఈ నేపథ్యంలో వేరుశనగ విత్తనాలు వెంటనే పంపిణీ చేయాలని కోరారు. కరువుకు సంబంధించిన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపి కరువు ప్రాంతంగా మండలాన్ని ప్రకటించి మండల రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. యూసుఫ్ బాష, లక్ష్మిరెడ్డి, నాగేష్, సుధాకర్, రవి, రంగస్వామి, లక్ష్మన్న పాల్గొన్నారు.

విద్యుత్ కోతలకు నిరసనగా... రోడ్డెక్కిన రైతులు

ప్రజాశక్తి - కౌతాళం

ఒకవైపు వర్షాభావ పరిస్థితులు, మరోవైపు విద్యుత్ కోతలు... సాగునీరందక ఎండిపోతున్న పంటలను చూసి నిరాశ చెందిన రైతులు రోడ్డెక్కక తప్పలేదు. బుధవారం మండలంలోని ఎరిగేరి చుట్టుపక్కల గ్రామాల రైతులు విద్యుత్ కోతలకు నిరసనగా రోడ్డుపై బైఠాయించారు. రూ.వేలకు వేలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు సాగునీరందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాల్సిన అధికారులు కనీసం 5 గంటలు కూడా సరఫరా చేయలేక పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో..! తెలియడం లేదని అన్నారు. వేళాపాల లేని విద్యుత్ కోతలకు మోటార్లు కాలిపోతున్నాయని తెలిపారు. పంట పొలాలకు సాగునీరు అందడమే కష్టంగా మారిందన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతుందని తెలుగు రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరాయంగా 9 విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పిన పాలకులు, అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేసి పంటలను కాపాడాలని కోరారు. లేకపోతే రైతుల ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనతో కౌతాళం నుంచి ఆదోని, ఆదోని నుంచి కౌతాళం, హాల్వి వైపు రాకపోకలు నిలిచిపోయాయి. నిరసనకు స్పందించి ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, విద్యుత్ శాఖ నరసన్న రైతులు, నాయకులతో చర్చించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించి సహకరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.

నిరసన చేపడుతున్న రైతులు

భూ కబ్జాల అడ్డా ఆదోని

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

తమ భూములు కబ్జాలకు గురయ్యాయంటూ బాధితులు పెరిగిపోతుండడంతో ఆదోని భూ కబ్జాలకు అడ్డాగా మారిందని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆదోనిలోని మండిగిరిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ‘గడపగడపకు మన ప్రభుత్వం’లో నేరుగా ఎమ్మెల్యేనే నిలదీయడం, తనయుడుపై బాధితులు తిరగబడడం, పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2024లో టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే కబ్జాల పర్వంపై న్యాయ విచారణ సంఘాన్ని, సిట్ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీంను ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో న్యాయ విచారణ చేపడతామన్నారు. విచారణ చేసి తప్పకుండా భూకబ్జాదారుల బాగోతాన్ని బయటపెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, వడ్డేమాన్ గోపాల్, మాజీ ఎంపిపి మురళీ, పట్టణ మైనార్టీ నాయకులు సాధిక్, వలీ, బాబురావు, వీరేష్, భారత్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గుడిసె కృష్ణమ్మ

ఎల్ఎల్‌సి నీరు విడుదల చేయాలి

- ఇరిగేషన్ కార్యాలయం ముందు రైతుల ధర్నా

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని ఎల్ఎల్‌సి ఆయకట్టు పొలాలకు నీరు విడుదల చేయాలని గోనెగండ్ల రైతులు డిమాండ్ చేశారు. బుధవారం గోనెగండ్లలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు చిట్యాల మునెప్ప, ముచ్చిగిరి ఉరుకుంద, షేక్ షావలీ, నగిరి పటేల్, చాంద్ బాష, కురువ రంగముని మాట్లాడారు. 86 కాలువ, పీడీ కాలువ నీరు రావడం లేదని, వర్షాల్లేక పంటలు ఎండి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గోడు అధికారులకు చెప్పుకుందామని కార్యాలయానికి వస్తే కార్యాలయం వద్ద ఇరిగేషన్ అధికారులు ఎవరూ లేరన్నారు.

ఎల్ఎల్‌సి ఎఇ భాస్కర్ వివరణ : ఎల్ఎల్‌సి నీరు పైనుంచి తక్కువ వస్తున్నాయి. మేము మూడు రోజులకోసారి నీళ్ల వంతులు వేశాం. గోనెగండ్ల కాలువలకు ఈరోజు సాయంత్రం విడుదల చేస్తాం.

ధర్నా చేస్తున్న రైతులు

9 గంటలు విద్యుత్ ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆదోని

వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్ ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి బి.వీరారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని గణేకల్లు సబ్ స్టేషన్ ముందు గణేకల్లు, జాలమంచి, పాండవగల్ రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాల్సి ఉండగా 5 గంటలు మాత్రమే సరఫరా చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం 9 గంటలు విద్యుత్ సరఫరాను కొనసాగించాలని, లేకపోతే విద్యుత్ అధికారులు కార్యాలయాలను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. రైతుసంఘం మండల నాయకులు హనుమంతు రెడ్డి, డివైఎఫ్ఐ మండల నాయకులు చిరంజీవి పాల్గొన్నారు.

తక్షణమే సాగునీరందించాలి...

- పంపు హౌస్ వద్ద రైతుల ఆందోళన
- వచ్చే సీజన్‌లోపు నీరు : డిఇ

ప్రజాశక్తి - నందవరం

తక్షణమే సాగు, తాగునీరందించి రైతులను ఆదుకోవాలని వివిధ గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. బుధవారం నది కైరవాడి వద్ద నందవరం మండలం మాచాపురం, ఇబ్రహీంపురం, చిలకలడోన గ్రామ రైతులు గురు రాఘవేంద్ర ప్రాజెక్ట్ చిలకలడోన ఎత్తిపోతల పథకం పంపు హౌస్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. చిలకలడోన ఎత్తిపోతల పథకం ద్వారా దాదాపు 4,083 ఎకరాలకు సాగునీరందించేందుకు గురు రాఘవేంద్ర ప్రాజెక్టు ఏర్పాటు చేశారని తెలిపారు. ఇబ్రహీంపురం, మాచాపురం, గంగవరం పొలాలకు ఎత్తిపోతల పథకం ప్రారంభమైనప్పటి నుంచి నీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రైతు సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. రైతుల ఆందోళన తెలుసుకున్న గురు రాఘవేంద్ర ప్రాజెక్ట్ ఇరిగేషన్ డిఇ రవికుమార్ రైతుల వద్దకొచ్చి పంపునకు నీళ్లు అందకపోవడంతో నీటిని సరఫరా చేయలేకపోతున్నామని తెలిపారు. అప్పటి టెక్నికల్ డిపార్ట్‌మెంట్ వేసిన స్కెచ్ ప్రకారం ప్రస్తుతం నీరందడం లేదని చెప్పారు. ఇదే విషయంపై టెక్నికల్ డిపార్ట్‌మెంట్‌ను పిలిపించి రైతులకు అనుకూలమైన పరిష్కారాన్ని చూపిస్తామన్నారు. వచ్చే సీజన్‌లోపు నీటి పారుదలకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. పంపునకు నీటిని అందేవిధంగా కొత్త కాలువను ఏర్పాటు చేస్తామని, మోటార్ పంపునకు మధ్య గ్యాప్ తక్కువ చేస్తామని చెప్పారు. రైతులు కోటేశ్వర్, దుర్యోధన, పెద్ద తిమ్మయ్య, తిక్కన్న, హుసేని, రంగస్వామి, సత్యన్న, శాంతి రాజ్ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న రైతులు

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, ADONI
E.P. No. 115/2017 IN O.S. No. 30/2011
BETWEEN:
Chagi Mahananda Reddy ...DHR
AND
B. Narayanappa died by Lr's ...JDR's

NOTICE

To:
B. Suresh, S/o B. Narayanappa, Hindu, R/o H.No: 5/278/3, Behind Shakthigudi, Adoni.(JDR No. 3)

Whereas the above named DHR has filed the above EP against You. The Hon'ble Court was pleased to summon you by way of paper publication. Therefore You are hereby directed to appear before this Hon'ble Court on 16/10/2023 at 10:30 AM either in person or through your Advocate and file your objections if any, failing which the matter will be decided in your absence.

L.K. Jeevan Singh, BE, LL.B Advocate for DHR

IN THE COURT OF THE 3RD ADDITIONAL JUNIOR CIVIL JUDGE : KURNOOL
O.S.NO.214/2023
Kurli.Sujatha. ...Plaintiff
VS
1) Gajja. Bala chennamma W/o Chinnapullaiah, Hindu, House Wife, H.No.44-135, Prakashnagar, Kurnool.
2) G.Venkateswarlu S/o Not known to Plaintiff, Hindu, H.No.18-115-B-3, Madhava Nagar, Kurnool.
3) S.Venkata Reddy S/o Venkateswarlu, 35years, Hindu, business, H.No.4-9-5-9, Stantanpuram (V), Kurnool (M) & (Dt).
4) J.Nagappa S/o Narasappa, 63 Years, Hindu, business, H.No.46-170A, B.Peta, Kurnool.
5) A.Jayaram S/o Nettekal, 50 Years, Hindu, business, H.No.46-178-3, B.Peta, Kurnool.
...Defendants

ప్రతి వాదులకు దావా సమన్లు

వాది పై దావా కోర్టులో దాఖలు చేసి తనను స్థిరాస్థిపై హక్కు దారుగా డిక్లేర్ చేయమని కోరుతూ ఉన్నది. మీకు ఏమైనా ఆక్షేపణలు వున్నచో పై కోర్టు ఎదుట 8/11/2023వ తేదీ ఉదయం 10 గంటలకు హాజరై తెలుపుకునేది. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడును.

వాయిదా తేదీ : 8/11/2023
(BY ORDER OF THE COURT)
T.Eswar Babu, Advocate for Plaintiff, Kurnool.

8 ఎకరాల పత్తి పంట దున్నివేత

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వర్షాభావ పరిస్థితులు ఓ రైతు కండతడి పెట్టించిన దుస్థితి మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని సోగనూరు గ్రామానికి చెందిన బోయ తిమ్మప్ప సాగు చేసిన పత్తి పంట దున్ని వేశారు. 8 ఎకరాల్లో ఎకరాకు రూ.20 వేలకు పైగా పెట్టుబడి పెట్టి పత్తి పంటను సాగు చేశారు. సరైన సమయంలో వర్షాలు కురవకపోవడం పంట మొత్తం ఎండిపోయింది. అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని రైతు వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

సహకార సంఘం గోదాములకు స్థల పరిశీలన : డిసిఒ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని వ్యవసాయ సహకార సంఘం పరిధిలో నూతనంగా మంజూరైన సహకార గోదాముల నిర్మాణానికి అవసరమైన స్థల పరిశీలనను జిల్లా సహకార బ్యాంక్ డిసిఒ రామాంజనేయులు, గోనెగండ్ల సింగిల్‌విండో ఛైర్మన్ తిరుమలరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గోనెగండ్ల వ్యవసాయ సహకార సంఘం పరిధిలో రెండు మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ గోదాములు నిర్మించడానికి ఒక్కో గోదాముకు రూ.46 లక్షల చొప్పున మంజూరయ్యాయని తెలిపారు. అందుకు సంబంధించి గోనెగండ్లలో 1, పెద్దమరివీడు గ్రామంలో 1 నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. వెంటనే నిర్మాణాలు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. డిఇ సుబ్బారెడ్డి, ఎఇ వీరేష్, సిఇఒ చంద్రశేఖర్, వైసిపి నాయకులు గంజిహళ్లి మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కైరుప్పల విద్యార్థులు

ఆస్పరి : రాష్ట్రస్థాయి అండర్-14, 17 కబడ్డీ పోటీలకు కైరుప్పల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు షేక్ అహ్మద్, వ్యాయామ ఉపాధ్యాయులు రామాంజనేయులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడారు. నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అండర్-17 కబడ్డీ పోటీలకు ఎం.ఓమేశ్వరి, అండర్-14 విభాగంలో కె.అనిత ఎంపికయ్యారని చెప్పారు. ఉపాధ్యాయులు మహ్మద్ షఫీ, వెంకటేశ్వరమ్మ, షర్మిల, దామోదర రావు, రాజేశ్వరి దేవి, వెంకట ప్రసాద్, అబ్రహాం, నిరీక్షణ, వాణి, అనిల్ కుమార్, పరమేష్, మహేష్, నాగేంద్ర అభినందించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి
- ఎల్ఎల్‌సి నుంచి ట్యాంకులోకి నీటి మళ్లింపు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పురవాసులకు వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాధాకృష్ణ తెలిపారు. బుధవారం బసాపురం ఎస్-ఎస్ ట్యాంకు మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్ఎస్ ట్యాంకు సైడ్ వాల్ 105 మీటర్లు కుంగిపోవడంతో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.55 లక్షలు మంజూరు చేసిందన్నారు. బండ్ తాత్కాలిక పనులను యుద్ధప్రాతిపదికన చేసేందుకు పూనుకున్నామని తెలిపారు. ట్యాంకులోనే సైడ్ వాల్‌కు సపోర్టుగా ఇసుక సంచులు పేర్చి బండ్ కుంగిపోకుండా తాత్కాలికంగా పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. సోమవారం నుంచి ట్యాంకులోకి నీటి మళ్లింపు చేయిస్తామని తెలిపారు. ప్రస్తుతం నాలుగు మోటార్లు ఉన్నాయని, అదనంగా మరో రెండు అమర్చి 16 రోజుల్లోపు ట్యాంకు నిండేలా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ట్యాంకు సామర్థ్యం 3110 మిల్లీలీటర్లు ఉండగా కనీసం 80 శాతమైనా నీటి నిల్వకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవిలో నీటిఎద్దడి రాకుండా ఈ చర్యలు చేపట్టామని తెలిపారు. ట్యాంకు చుట్టూ కొత్తగా సైడ్ వాల్ నిర్మించేందుకు రూ.24.40 కోట్లు అవసరమవుతాయని చెప్పారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా తాత్కాలిక పనులు చేపట్టి, పనులకు అనుమతి రాగానే పూర్తిగా పునరుద్ధరణ చేయిస్తామన్నారు. డిప్యూటీ ఇంజినీర్ వెంకట చలపతి రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డి, కాంట్రాక్టర్ వీరేష్ ఉన్నారు.

ట్యాంకు బండ్ తాత్కాలిక పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

కల్లుకుంటలో తాగునీటి ఎద్దడి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని కల్లుకుంట గ్రామంలో తాగునీటి సమస్యతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. తాగునీటి కోసం పంట పొలాల వెంట పరుగులు తీస్తున్నారు. మండలంలోని కల్లుకుంట గ్రామంలో తాగునీటి సమస్య వారం నుంచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాల దగ్గరకెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామ చివరిలో కొత్త ట్యాంకు నిర్మాణం పూర్తయినా అందులోకి నీరు రావడం లేదు. ఇంటింటికి కుళాయి, పైపులైన్ వేశారు. రెండు నెలలకే పూర్తయింది. పైపు లైన్లు, వాటర్ ట్యాంకు నిరుపయోగంగా మారడంతో ప్రజలు ఉదయం 6 గంటలకే బోరుబావుల దగ్గరికి వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. సర్పంచి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. పంట పొలాల దగ్గర మిర్చి పంటలను తొక్కుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను, సర్పంచిని ప్రజలు కోరుతున్నారు.

ప్రాచీన కట్టడాలను కాపాడుకుందాం

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

ప్రాచీన కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఛాంబర్‌లో రెవెన్యూ, సర్వే, మున్సిపల్, ఆర్కియాలజీ, షాహి జామియా మసీదు పెద్దలతో మసీదు పరిసరాల్లో జరుగుతున్న కట్టడాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 500 ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాచీన కట్టడాలైన మసీదును అందరం కలిసి కాపాడుకోవాలన్నారు. మసీదు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న కట్టడాలపై రెవెన్యూ, సర్వే, మున్సిపల్ అధికారులతో కలిసి ప్రాథమిక విచారణ చేపట్టి నివేదికలు ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. డిప్యూటీ తహశీల్దార్ రజినీకాంత్ రెడ్డి, మండల సర్వేయర్ రమణ, మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు, షాహి జామియా మసీదు పెద్దలు సౌదీ రావుఫ్, ఖాన్ పాల్గొన్నారు.

సబ్ ప్లాన్ నిధులను ఎందుకు ఖర్చు పెట్టరు..? : కెవిపిఎస్

ప్రజాశక్తి - కోసిగి

2013లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని పోరాడి సాధించామని, దళితులకు న్యాయంగా ఖర్చు పెట్టాల్సిన సబ్‌ప్లాన్ నిధులను ఎందుకు ఖర్చు పెట్టరని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం ప్రశ్నించారు. బుధవారం మండలంలోని దుద్ది గ్రామంలో కెవిపిఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా కెవిపిఎస్ పతాకావిష్కరణ చేపట్టారు. ముఖ్యఅతిథిగా దేవసహాయం హాజరయి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కెవిపిఎస్ మండల నాయకులు ముక్కురన్న అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవసహాయం, మండల కార్యదర్శి రామకోటి హనుమంతు మాట్లాడారు. పాలకులు ఎవరున్నా దళితులను మోసం చేస్తూనే ఉన్నారని తెలిపారు.

పేదల ఆరోగ్యమే జగనన్న ధ్యేయం

- సర్పంచి గంగవరం శివన్న

ప్రజాశక్తి - నందవరం

పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని పెద్దకొత్తిలి సర్పంచి గంగవరం శివన్న తెలిపారు. బుధవారం మండలంలోని పెద్దకొత్తిలి పంచాయతీ పరిధిలోని గంగవరం గ్రామంలో ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్య, వైద్యానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గ్రామ పరిధిలో దాదాపు 550 మంది వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారని చెప్పారు. డాక్టర్లు చంద్రకాంత్, వైసిపి నాయకులు విరుపాక్షి రెడ్డి, రఘునాథ్, రాముడు, నరసింహులు పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచిన వైసిపి

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ
- ‘మేము సైతం’ అంటూ ఉద్యమం

ప్రజాశక్తి - ఆదోని

రైతులకు 9 గంటలు విద్యుత్ ఇస్తామని ప్రలోభ పెట్టి 4 గంటలు కూడా ఇవ్వకుండా వైసిపి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ విమర్శించారు. బుధవారం ఆదోని మండలం బసాపురం గ్రామంలో చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ ‘మేము సైతం’ అంటూ ఇంటింటా సంతకాలు సేకరిస్తూ పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చంద్రబాబు హయాంలో రైతులకు 9 గంటలు నాణ్యమైన విద్యుత్ అందించారని తెలిపారు. రైతులు వర్షాల్లేక కరువుతో దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. బోర్ల నీళ్లు ఉండి తడి చేసుకుందామని ఆలోచిస్తే కనీసం 4 గంటలు కూడా విద్యుత్ ఇవ్వలేని పరిస్థితికి తీసుకొచ్చారన్నారు. తక్షణమే కరువు మండలాలను ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, వడ్డేమాన్ గోపాల్, సాధిక్, బాబురావు, నాగిరెడ్డి, వేమన్న, వీరేష్, భరత్ కుమార్ పాల్గొన్నారు.

మంత్రాలయం : వైసిపి పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తామని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని వగరూరు గ్రామంలో ‘బాబుకు తోడుగా’ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చంద్రబాబు అక్రమ అరెస్టుపై ప్రజలకు వివరిస్తూ, జగన్మోహన్ రెడ్డి చేస్తున్న మోసాలను తెలిపి చైతన్యం చేస్తున్నామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని, చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. యువ నాయకులు పవన్ కుమార్ రెడ్డి, అబ్దుల్ సాబ్, గోపాల్, దస్తగిరి, లింగప్ప పాల్గొన్నారు.

మంత్రాలయంలో ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న దివాకర్ రెడ్డి

IN THE COURT OF THE PRINICIPAL JUNIOR CIVIL JUDGE : PRODDATUR
O.S.No.43/2023
Nali Ramakrsihna Yadav,
S/o Late Pulla Reddy Yadav, D.No.26/922-2,Flat No:6, Varalakshmi Apartments,Guruvaiah Thota, Mittamadi Veedhi,Proddatur Town and Mandal,Kadapa District
....Plaintiffs
Vs
5)Komera Prasanna,D/o Chandra Sekhar,D.No:45/24-K45-1,Venkata Ramana Colony,Kurnool City & District
6)Komera Prathyusha,D/o Chandra Sekhar,D.No:45/24-K45-1,Venkata Ramana Colony,Kurnool City & District
7)Komera Somasekhar,S/o Chandra Sekhar,D.No:45/24-K45-1,Venkata Ramana Colony,Kurnool City & District
...-Defendants No.5 to 7

SUMMON D5 to D7

Please take summon that the above suit filed by the plaintiff for recovery of suit amount against the Defendants No.5 to 7 and the said matter is posted on **06/11/2023** for your appearance at **10-30 A.M**.Please make it convienent to attend the above said Hon'ble court on the above said date and time either in person or through an advocate, failing which the matter will be decided in your absence as per law, Please take notice accordingly.
For Hg : 6/11/2023

Sd/-G.V.BHASKAR REDDY
Advocate,Proddatur
Kadapa District

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, ADONI
O.S. No. 517 OF 2022
BETWEEN:
P Shankaraiah Gupta ... Plaintiff
AND
K Prahalda Reddy Died by Lr's and others ....Defendents

NOTICE

To:
1. K Mallamma, W/o Late K Prahalda Reddy, Hindu, aged about 60 years (Defendant No.1),
2. Jayamma, D/o Late K Prahalda Reddy, Hindu, aged about 41 years (Defendant No.2),
3. K Raghava Reddy, S/o Late K Prahalda Reddy, Hindu, aged about 37 years (Defendant No.3)
(All are resident of Chinnaharivanam Village, Adoni Mandal, Kurnool district.)

Whereas the above named Plaintiff has filed the above suit against You. D1 to D3 The Hon'ble Court was pleased to summon you by way of paper publication. Therefore You D1 to D3 are hereby directed to appear before this Hon'ble Court on 18/10/2023 at 10:30 AM either in person or through your Advocate and file your objections if any, failing which the matter will be decided in your absence.

L.K. Jeevan Singh BE, LL.B
Advocate for Plaintiff

ప్రజాశక్తి
గురువారం 12 అక్టోబర్ 2023 5
నంద్యాల

సమావేశంలో మాట్లాడుతున్న టి.రమేష్ కుమార్

విఓఎల సమస్యలు పరిష్కరించాలి

- హెచ్ఆర్ పాలసీ అమలు చేయకపోతే ఆందోళన ఉధృతం
- సిఐటియు, విఓఎల సంఘం నేతలు
- ముగిసిన 36 గంటల నిరసన ధర్నా, వంటావార్పు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

విఓఎల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉదతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు హెచ్చరించారు. ఎపి వెలుగు విఓఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 36 గంటల ధర్నా, వంటా వార్పు కార్యక్రమం బుధవారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు, జిల్లా కార్యదర్శులు లక్ష్మణ్, వెన్న బాలవెంకట్, వివోఏల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, తిరుపతయ్యలు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వివోఏల సమస్యలు పరిష్కారం చేయకుండా గత నాలుగు సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా వివోఎల సమస్యలను పరిష్కరించాలని, రాబోయేది ఎన్నికల కాలమే గుర్తుపెట్టుకోవాలని, లేకుంటే వైసిపి ప్రభుత్వానికి వివోఏలంతా ప్రజలను ఐకమత్యం చేసి బుద్ధి చెప్పేందుకు సిద్ధం అవుతారని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం 36 గంటల అనంతరం స్పందించకపోతే అవసరమైతే చలో విజయ వాడకైనా, నిరవధిక సమ్మెకైనా సిద్ధమని హెచ్చరించారు. కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలన్నారు. సిబిఓహెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ. 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. విఓల మెర్జ్ ఆపాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలన్నారు. లోకో యాప్ వర్క్ కోసం 5జి మొబైల్ ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. వాలంటీర్ ఐడితో విఓఎలతో పనిచేయించరాదన్నారు. విఓఎ ఐడి ద్వారానే పని చేయించాలన్నారు. 15 సంఘాల లోపు ఉన్న విఓఏ లకు వేతనాలు చెల్లించాలని, విఓల మెర్జ్ వలన ఉపాధి కోల్పోయిన విఓఏలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఓ పుల్లయ్యకి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విఓఎల సంఘం జిల్లా నాయకులు భాస్కర్, శంకరయ్య, పుల్లయ్య, రోజ్ లిన్, అల్లిపీరా, సులోచన, విఓఎలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డిఆర్ఓకు వినతిపత్రం ఇస్తున్న విఓఎలు, నాయకులు

కృష్ణా జలాలపై గెజిట్‌ను రద్దు చేయాలి

- ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రమేష్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల

కేంద్ర ప్రభుత్వం కృష్ణానది జలాల పునర్విభజన కోసం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు రెఫర్ చేస్తూ ప్రకటించిన గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాలలోని నరసింహయ్య భవన్లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ గెజిట్ ఆంధ్ర రాష్ట్ర రైతుల సాగునీటి ప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా ఉందన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలు అంగీకరించిన వాటికి భిన్నంగా ఉందని తెలిపారు. కేవలం బిజెపి తెలంగాణలో ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం గెజిట్ ప్రకటించిందన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకున్న స్వార్థపూరితమైన రాజకీయ నిర్ణయాల వల్ల ఆంధ్ర రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గెజిట్‌ను రద్దు చేయించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అలా జరగని పక్షంలో రాష్ట్రంలోని రైతు సంఘాలు, రాజకీయ పార్టీలు ఐక్యమై గెజిట్ రద్దు చేసేవరకు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, సహాయ కార్యదర్శులు టి.రామచంద్రుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విజేత విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తున్న డిఆర్ఓ తదితరులు

విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్య, వైద్యానికి పెద్ద పీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు .బుధవారం మండలంలోని టంగుటూరు గ్రామంలో రూ. 1 కోటి 85 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్ర బోతుల పాపిరెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకట రమణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతమైన టంగుటూరులో 1 కోటి 85 లక్షల రూపాయలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. కార్పొరేటు స్థాయిలో అందించే వైద్యాన్ని గ్రామీణ ప్రాంతాలకు సైతం విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లను ఏర్పాటు చేసి మెరుగైన ప్రభుత్వ వైద్యాన్ని పేదల ముంగిట వద్దకే అందిస్తున్నట్లు చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాలకు సైతం డాక్టర్లు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారని ఎలిపారు. దేశంలో ఇలాంటి ముఖ్యమంత్రిని ఎక్కడా మరెవరు కూడా చూడలేదని తెలిపారు. 2024 ఎన్నికల్లో మళ్ళీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని చేసుకోవాలని, అప్పుడే ఇంకా రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి , అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి, ఎంపీడీవో శివరామయ్య, టంగుటూరు ప్రాథమిక వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివ శంకరుడు, డాక్టర్ సోహెల్ బాబు, ఎంపీపీ మానసవీణ, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మంగవరపు లక్ష్మీదేవి, కుర్నీ సంఘం రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ మెటికల శ్యామలాదేవి, టంగుటూరు గ్రామ నాయకులు సురేష్ కుమార్ రెడ్డి, హనుమంత రెడ్డి, పెద్ద శివారెడ్డి, కానాల నాగేశ్వర రెడ్డి, ఎంపిటిసి మహానంద రెడ్డి, సర్పంచ్ సూర్య నాగ మద్దిలేటి, దండే సుబ్బలక్ష్మి రెడ్డి, గొల్ల బాల సుబ్బన్న, కాజుబేగ్ ,కన్వీనర్లు దేశం సురేష్ రెడ్డి, భీమిరెడ్డి జనార్దన్ రెడ్డి, డి హుస్సేన్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న జడ్పి చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యే, జెసి తదితరులు

చిత్ర లేఖనంతో సృజనాత్మకత వెలికి

- జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య
- ఉత్సహ భరింతంగా చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పిల్లలలో ఉన్న సృజనాత్మకతను, వారిలో దాగి ఉన్న కళలను వెలికి తీయడానికి చిత్రలేఖనం పోటీలు దోహదపడతాయని జిల్లా రెవిన్యూ అధికారి బి.పుల్లయ్య అన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ టౌన్ హాల్ నందు నంది విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటిల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు డిఆర్ఓ బి.పుల్లయ్య, మున్సిపల్ కమీషనర్ సి. రవి చంద్రారెడ్డిలు మెమొంటోలు ప్రదానం చేశారు. అనంతరం జరిగిన సభకు నంది విజ్ఞాన వేదిక కన్వీనర్ రామరాజు అధ్యక్షత వహించారు. డిఆర్ఓ మాట్లాడుతూ 64 కళలో చిత్రలేఖనంకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. నంది విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దాగి ఉన్న కళలను వెలికి తీయడం కోసం ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రామరాజు, నంది విజ్ఞాన వేదిక సభ్యులు గోపాల్, గురుస్వామి, క్రాంతికుమార్, నగేష్ సాయిబాబా, వెంకటరమణ, ఖాజాహుస్సేన్, డ్రాయింగ్ మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** కొలిమిగుండ్లలోని కస్తూరిబా గాంధీ విద్యాలయం విద్యార్థులు నంద్యాలలో జరిగిన చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చాటి బహుమతులు గెలుచుకున్నారు. కస్తూరిబా స్కూల్ ఇన్చార్జి ఎస్ఓఎస్ మహబూబ్ జాను సహకారంతో సైన్స్ టీచర్ మల్లిక ఆధ్వర్యంలో విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థిని సౌజన్య బహుమతి సాధించింది.

విద్యుత్ సమస్యలు తెలియజేయండి : ఎడి

ప్రజాశక్తి - మహానంది

గ్రామాల్లో, వ్యవసాయ విద్యుత్ సరఫరా విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక ఏఈ లేదా తనకు తెలియజేస్తే పరిష్కరిస్తామని విద్యుత్ నంద్యాల రూరల్ ఎడి సతీష్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం మహానంది క్షేత్రంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నుండి వ్యవసాయ రంగానికి అందిస్తున్న విద్యుత్ సరఫరాపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలో సాంకేతిక కారణాలు తలెత్తడంతో రెండు రోజుల నుంచి విద్యుత్కు అంతరాయం కలుగుతుందన్నారు. రెండు మూడు రోజులు అనంతరం వ్యవసాయానికి, పూర్తిగా విద్యుత్ సరఫరా అందించడంతోపాటు గృహ అవసరాలకు కూడా ఎలాంటి అవాంతరం లేకుండా సరఫరా చేస్తామన్నారు. రైతుల వ్యవసాయ విద్యుత్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెచ్‌విడిసి పనులు అక్కడక్కడ నిలిచిపోయాయని, రైతులు ఇబ్బంది పడుతున్నారని ప్రశ్నించగా ప్రస్తుతం దీనికి సంబంధించి పునరుద్ధరించడానికి అనుమతులు మంజూరు కావాల్సి ఉందన్నారు. ఈ తనిఖీల్లో ఏఈ .ప్రభాకర్ రెడ్డి, జెఏఈ శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విద్యుత్ ఎడి సతీష్ కుమార్ రెడ్డి

ఆర్‌బికెల్లో పేర్లు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గత నాలుగు సంవత్సరాలలో ఏకారణం చేతనైనా వైయస్సార్ రైతు భరోసా అందని రైతులు ఈ నెల 15వ తేదీలోపు మళ్లీ పేర్లను ఆర్‌బికెల్లో నమోదు చేసుకోవటానికి అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని జిల్లా వ్యవసాయ అధికారి టి.మోహన్ రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున రైతు భరోసా రాని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పైపులైన్ లీకేజీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

పైప్ లైన్ లీకేజీ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-డోన్

డోన్‌లోని కొండపేట ప్రాంతానికి సంబంధించిన పైప్ లైన్ లీకేజ్ సమస్యను పరిష్కరించినట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. బుధవారం డోన్ పట్టణంలోని వైఎస్ నగర్ హైవే దగ్గర కొండపేటకు వచ్చే తాగునీరు 400 ఎంఎం డీఐ పైప్ లైన్‌లో లీకేజ్ అవుతున్న ప్రాంతాన్ని మున్సిపల్ చైర్మన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం పైపులైన్ లీకేజీ నీటి సమస్య ఉందని తెలిసిన వెంటనే ఆ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన తక్షణమే మరమ్మతులు చేపట్టి లీకేజీ నీటి సమస్యను పరిష్కరించామని తెలిపారు.

శాంతిరాం కళాశాలకు న్యాక్ ఎ-ప్లస్ గ్రేడ్

ప్రజాశక్తి - పాణ్యం : శాంతిరాం ఫార్మసీ కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించింది. న్యాక్ ఎ, ఎ-ప్లస్, సాధించిన వివిధ విభాగాల నుండి విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ కళాశాలలతో సహా దాదాపు 85 కళాశాలలు పాల్గొన్నాయి. ఈ ఘనత సాధించిన ప్రిన్సిపల్, సిబ్బందిని, విద్యార్థులను చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతిరాముడు, ఎండి శివరామ్ అభినందించారు.

సెలవుల్లో గ్రంథాలయాలను సందర్శించండి

ప్రజాశక్తి - వెలుగోడు : విద్యార్థులు దసరా సెలవులలో గ్రంథాలయాలను సందర్శించాలని గ్రంథాలయ అధికారిని సుమలత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ కర్నూలు వారి ఆదేశాల మేరకు దసరా సెలవులలో విద్యార్థినీ విద్యార్థులు గ్రంథాలయంను సందర్శించి పుస్తకాలను ఉపయోగించుకోనే విధంగా వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. అందులో భాగంగానే వెలుగోడు పట్టణంలోని లిటిల్ ఏంజెల్స్, డీపోల్, బృందావన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎంలను కలిసి విద్యార్థిని విద్యార్థులకు గ్రంథాలయాలలోని పుస్తకాలను చదివే అలవాటు చేసుకోవాలని కోరుతూ వినతులు అందజేశారు.

కరస్పాండెంట్ ఇమానియల్‌కు వినతి అందిస్తున్న సుమలత

సమాజ సేవే ప్రధాన లక్ష్యం

- సినిమా నిర్మాత, పారిశ్రామికవేత్త శెట్టి విజయ్ కుమార్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

సమాజానికి సేవ చేయడమే తన ప్రధాన లక్ష్యమని అహోబిలం సినిమా నిర్మాత, పారిశ్రామికవేత్త శెట్టి విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని హరినగరం వద్ద అహోబిలం మూవీ ప్రమోషన్ వేడుకలతో పాటు ప్రొడ్యూసర్ శెట్టి విజయ్ కుమార్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శెట్టి విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం గొప్పతనం, మహిమల గురించి యావత్ ప్రపంచానికి తెలియజేయాలనే లక్ష్యంతోనే అహోబిలం మిస్టరీ ఆఫ్ ది హిస్టరీ సినిమాను నిర్మించామన్నారు. స్వామి ఆశీస్సులతో సినిమాను త్వరలో విడుదల చేస్తామన్నారు. త్వరలో ఓటీపీలో కూడా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవ కార్యక్రమాలను యునెస్కో సంస్థ వారికి డాక్యుమెంటేషన్ రూపంలో అందజేశామన్నారు. ఈ సంస్థ ద్వారా గుర్తింపు కలిగితే ప్రపంచంలోనే అతి ముఖ్యమైన పుణ్యక్షేత్రంగా అహోబిలం విరాజిల్లుతుందన్నారు.

అందరి సహకారంతో బలిజ సంఘం అభివృద్ధికి కృషి : అందరి సహకారంతో బలిజ సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్నామని శెట్టి విజయకుమార్ అన్నారు. రుద్రవరం మండలం ఆలమూరు తన స్వగ్రామమని, తనకు ఆళ్లగడ్డ నియోజకవర్గంతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు చేయాలని సదుద్దేశంతో తనను అహోబిలం బలిజ సంఘీయుల అన్నసత్రానికి అధ్యక్ష నిర్వాహక బాధ్యతలు అప్పగించారన్నారు. త్వరలోనే పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు ఇస్తామన్నారు. అనంతరం శెట్టి విజయ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా బలిజ సంఘాలు, ఇతరుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. దర్శకులు జగదీష్ మాట్లాడుతూ నిర్మాత శెట్టి విజయ్ కుమార్ అహోబిలం పావన క్షేత్రం రోడ్డు నిర్మాణానికి సహకారం అందించారన్నారు. ఆహోబిలం సినిమాను ప్రేక్షకులు ఆదరించాలన్నారు. కార్యక్రమంలో అహోబిలం సినిమా నటీనటులు బైరం లక్ష్మీ శేఖర్, దూదేకుల శిరీష, బలిజ సంఘం నాయకులు, ఉమ్మడి కర్నూలు జిల్లా టిడిపి మాజీ ఉపాధ్యక్షులు గూడూరు సంజీవరాయుడు, టిడిపి నాయకులు గంగాధర్, సిద్ధం శివరాం, మైలేరి మల్లయ్య, ఉల్లి వెంకట సుబ్బయ్య, ఉల్లి గురప్ప, యామగురప్ప, పోలా గురుమూర్తి, కొల్లం పుల్లయ్య, పత్తి సత్యనారాయణ, బాలరాజు, బుడ్డా శెట్టి అంజి తదితరులు పాల్గొన్నారు.

కేక్ తినిపిస్తున్న శెట్టి విజయ్ కుమార్

మొక్కజొన్న ధాన్యం తడిసిపోవడంతో పట్టాలు కప్పిన రైతులు

రుద్రవరం మండలంలో వర్షం

- తడిసిన మొక్కజొన్న పంట

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలంలోని పలు గ్రామాలలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. రహదారులపై, ఆరుబయలు ఆరబెట్టుకున్న మొక్కజొన్న పంట పూర్తిగా తడిచిపోయింది. రుద్రవరం, ఆర్ నాగులవరం, రెడ్డిపల్లి తువ్వ పల్లి, కొండమాయపల్లి ,ఆర్ కొత్తూరు, ఆర్ కొత్తపల్లి, బి నాగిరెడ్డి పల్లె తదితర గ్రామాలలో రైతులు మొక్కజొన్న పంట కోత కోసి రోడ్లపై, పంట పొలాలలో ఆరబెట్టుకున్నారు. గత 10 రోజులు నుంచి విపరీతమైన ఎండలతో ఉన్న వాతావరణం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో రైతులు ఆరబెట్టిన మొక్కజొన్న పంట పూర్తిగా తడిచిపోయింది. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట కోత కోసి ఇంటికి తీసుకువచ్చి అమ్ముకునే సమయంలో వర్షం కురిసి తడిచిపోవడంతో రైతుల బాధ వర్ణనాతీతం. తడిసిన ధాన్యంకు సరైన గిట్టుబాటు ధర పలుకుతుందో లేదోని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి తడిచిన పంటను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

డంప్ యార్డుకు ఆకతాయిలు నిప్పు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని శాంతి థియేటర్ వెనక భాగంలో ఉన్న డంపింగ్ యార్డ్‌కు కొందరు ఆకతాయిలు బుధవారం నిప్పు పెట్టారు. దీంతో సమీపంలోని ఆయా వార్డులలో పొగలు కమ్ముకున్నాయి. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఫైర్ ఇంజన్, జెసిబిలతో మంటలను అదుపు చేయించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

డంప్ యార్డ్ పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

రాజీనామా చేస్తా.. పోటీ చేసి గెలిచి చూపించు..

- గంగుల కుటుంబం వెంట సైనికుల్లా పని చేస్తాం
- భూమా కిషోర్ రెడ్డికి ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి సవాల్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

'ఎంపిటిసి పదవికి నేను రాజీనామా చేస్తానని, నాపై నువ్వు పోటీకి నిలబడేందుకు సిద్ధమా.. పోటీ చేసి గెలిచి చూపించు' అని ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి బిజెపి తాలూకా ఇంచార్జ్ భూమా కిషోర్ రెడ్డికి సవాల్ విసిరారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడరు. కిషోర్ రెడ్డి ఉనికి కోసమే తమ నాయకుడు గంగుల నానిపై లేని పోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యే గంగుల ఆళ్లగడ్డ నియోజకవర్గంలో సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రజల్లోకి దూసుకెళ్తున్నారన్నారు. గంగుల కుటుంబం జమిందార్ కుటుంబమని అంటున్నావని, ఎప్పటికీ జమిందార్ కుటుంబమేనని అన్నారు. నియోజకవర్గంలో సిఎం రిలీఫ్ ఫండ్ కోసం వైసిపి నాయకులు కమిషన్లు అడుగుతున్నారని ఆరోపణ చేశావని, దానిని రుజువు చేయాలని సవాల్ చేశారు. అభివృద్ధి, సంక్షేమం నియోజకవర్గంలో జరగలేదంటున్నావని, అదే రిఫ్రెండంగా ఎంపిటిసికి తాను రాజీనామా చేస్తానని, తనపై పోటీకి నిలబడేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. గెలిచి ప్రజల్లో సత్తా చాటాలని సవాల్ చేశారు. గంగుల కుటుంబం వెంట తాము సైనికుల్లా పని చేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, కౌన్సిలర్ గొట్లురు సుధాకర్ రెడ్డి, కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు, మున్సిపాలిటీ వైసిపి ఇంచార్జి గోపవరం నరసింహారెడ్డి, యాదవాడ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎంపిపి

'మధ్యాహ్న భోజన' నిర్వహణకు వంట సామాగ్రి పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల రూరల్.

నంద్యాల మండలంలోని 128 ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు వంటసామాగ్రిని బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం అవరణంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆయా పాఠశాలల బాధ్యులకు పంపిణీ చేశారు. అలాగే టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన క్లీనింగ్ మెటీరియల్లు, విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు అవసరమైన క్రీడా సామాగ్రిని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, వైస్ చైర్మన్ పాంషావలి, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డిడ్డి, ఎంఈఓ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

వంట సామాగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

టిడిపిలోకి స్వాగతిస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

వైసిపి నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైలంలోని పాల కొట్టాల కాలనీకి చెందిన 50 మదిగాజ్ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు వైసిపిని వీడి శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సమక్షంలో బుధవారం టిడిపిలో చేరారు. కర్ణ కొండయ్య, కర్ణ మల్లికార్జున, పిట్టల వెంకటేశ్వర్లు, పిట్టల కొండయ్య, చెంబేటి నరసింహులు, పాల రమేష్ తదితరులకు మాజీ ఎమ్మెల్యే టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎస్‌సి, ఎస్‌టిలను అభివృద్ధి బాటలో నడిపించాలి

- ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

బండి ఆత్మకూరు మండలంలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలను అభివృద్ధి బాటలో నడిపించాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు బిటికెల సలోమి అన్నారు. బుధవారం బండి ఆత్మకూరు తాసిల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఎస్సీ ఎస్టీల భూములను భూస్వాములు ఆక్రమించుకున్నారని, వాటిని విముక్తి చేయడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారన్నారు. వారికి చెందాల్సిన ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని ఎస్సీ ఎస్టీలకు చెందేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఎస్సీ ఎస్టీ కేసులను వరతగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో ఎస్సీ ఎస్టీలు అద్దెల్లో జీవిస్తున్నారని, వారికి ప్రభుత్వం స్వయం ఉపాధి పథకాలను అందించాలని, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

మాట్లాడుతున్న సలోమి

సమస్యలు త్వరగా పరిష్కరించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె : మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తెచ్చిన సమస్యలను అధికారులు త్వరగా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పాపులు భవనంలో ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అన్ని శాఖల అధికారులతో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే సమీక్షించారు. గత సమావేశంలో తీర్మానం చేసిన, ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ఏ మేరకు పరిష్కరించారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా శాఖల అధికారులు మూడు నెలల్లో మండలంలో జరిగిన వివిధ శాఖల అభివృద్ధిని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివరామయ్య, ముస్లిం షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మాజీ ఖైర్, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మంగవరపు లక్ష్మి దేవి, కుర్బి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మెటికల శ్యామల దేవి, డిప్యూటీ తహశీల్దార్ కిషోర్ కుమార్ రెడ్డి, ఎఇ సుబ్బారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సాయి కృష్ణ, పంచాయతీరాజ్ ఏఈలు మహేష్, వెంకటరమణ, ఎంఈఓ స్వరూప, విద్యుత్ ఏఈలు శ్రీనివాసులు, గజ్జప్ప, ఏపీఎం తిరుపాల్ రెడ్డి, ఏపీవో హరికృష్ణ, సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేద రైతులకు అన్యాయం చేయవద్దు : రైతు సంఘం

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు మండలం కొణిదేల గ్రామంలో ఐపిదారుడి పొలాన్ని బహిరంగ వేలంలో కొనుగోలు చేసిన పేద రైతులకు అన్యాయం చేయవద్దని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడులు అధికారులను కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నందికొట్కూరు మండలం కొణిదేల గ్రామంలో సుమారు ఐదు సంవత్సరాల క్రితం గ్రామ పెద్దలు, ప్రజలందరి సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహించి నాటూరు గ్రామ పొలిమేరలోని సర్వే 343/1లో 6.18 సెంట్లు గల నక్కల బరక భూమిని కొణిదెల గ్రామానికి చెందిన బెస్త రాజు తండ్రి వల్ల స్వామి, గువ్వల శేషన్న, తండ్రి వెంకటస్వామిలు కొనుగోలు చేశారని, గ్రామ పెద్దల సాక్షిగా భూమి అప్పగించారని చెప్పారు. ఈ భూమికి యజమానిగా ఉన్న గుంత లక్ష్మీనారాయణ తండ్రి బాల నాగయ్య గ్రామంలో వడ్డ వ్యాపారం చేసి, నష్టపోయి రైతులందరికీ డబ్బులు చెల్లించలేని స్థితిలో ఐపి పెట్టి ఆత్మహత్య చేసుకునే పరిస్థితిలో ఉన్నప్పుడు ప్రజలందరూ కలిసి ఆయనకు ఉన్న ఆస్తి, వ్యవసాయ భూమిని గ్రామ ప్రజలందరి సమక్షంలో వేలం నిర్వహించి వచ్చిన డబ్బులతో అప్పుదారులందరికీ చెల్లించారని తెలిపారు. నాటి నుండి నేటి వరకు వేలంపాటలో డబ్బులు చెల్లించి భూములు తీసుకున్న పేద రైతులు ఇద్దరు ఆ భూమిని అనుభవిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం గ్రామంలో ఒకరిద్దరూ పెద్ద మనుషులు నాడు వేలంలో పాల్గొన్న వారే భూమి దేవుని మాన్యమునకు చెందినదని, బెస్త రాజు, గువ్వల శేషన్న నుండి భూమిని దౌర్జన్యంగా లాక్కోవాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తద్వారా పేద రైతులు, బలహీన వర్గానికి చెందిన రాజు, శేషన్న తీవ్రంగా నష్టపోతారని, ఫలితంగా గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు,అల్లర్లు జరిగే అవకాశం ఉందన్నారు. గ్రామ పెద్దలు కుదిర్చిన ఒప్పందం అమలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ పెద్దలు ఓబుల్ రెడ్డి, ఎస్.కృష్ణారెడ్డి, వంగల ప్రతాప్ రెడ్డి, నాగిరెడ్డి, హరీష్ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖోఖో పోటీల్లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

- ఉమ్మడి కర్నూలు జిల్లా ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి

ప్రజాశక్తి - పగిడ్యాల

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో ఉమ్మడి కర్నూలు జిల్లా తరఫున ఆడి ప్రతిభ చాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఉమ్మడి కర్నూలు జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి క్రీడాకారులకు సూచించారు. బుధవారం పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఖోఖో జట్టుకు శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పుల్యాల నాగిరెడ్డి మాట్లాడారు. ఈ నెల 19 నుంచి చిత్తూరు జిల్లా యాదమర్రిలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలో పాల్గొనే ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు మొదటి బహుమతి గెలుపొందేలా శిక్షణ ఇవ్వాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. మనోధైర్యం, పట్టుదలతో పాటు క్రీడా స్ఫూర్తి కలిగినప్పుడే విజయం సాధించవచ్చని క్రీడాకారులకు సూచించారు. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి శాప్ చైర్మన్ అయినప్పటి నుంచి సిఎం జగనన్న సహకారంతో ప్రతి జిల్లాలో వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి పెరుమాళ్ళ శేషన్న, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీధర్ కుమార్, క్రీడాశ్రీ తోకల పీతాంబ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఖోఖో శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి

దుమ్ము, ధూళి, పాచి పట్టిన నీళ్ల ట్యాంక్

పాఠశాలలో అపరిశుభ్రంగా నీటి ట్యాంకు

- విద్యార్థులు రోగాలు బారిన పడే ప్రమాదం

ప్రజాశక్తి - ప్యాపిలి

ప్యాపిలిలోని బాలికల ఉన్నత పాఠశాలలో తాగు నీటి ట్యాంకు పాచి పట్టి, దుమ్ము ధూళి చేరుకుని అపరిశుభ్రంగా ఉంది. వారానికి ఒకసారి శుభ్రం చేయాలని నిబంధన ఉన్నా పట్టించుకోవడం లేదు. విద్యార్థులు అదే నీటిని తాగడం వలన రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ట్యాంకుపై మూతలు లేకపోవడం వలన పైనుంచి దుమ్ము ధూళి పడుతుంది. కోతులు అక్కడికి చేరుకొని నీళ్లను అపరిశుభ్రం చేస్తున్నాయి. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేయడానికి కూడా ఇదే నీటిని వాడుతున్నారు. మధ్యాహ్న భోజనం అంతంత మాత్రమే రుచికరంగా ఉండడం వలన విద్యార్థినీలు సక్రమంగా తినని పరిస్థితి ఉంది. మరోపక్క తాగునీరు అపరిశుభ్రంగా ఉండడవ వల్ల విద్యార్థులు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు పాఠశాలలోని తాగునీటి ట్యాంకును శుభ్ర పరిచేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆలయంలో హుండీ నగదు చోరీ

- మూడు గంటల్లోనే నిందితుడి గుర్తింపు

ప్రజాశక్తి - అవుకు : అవుకు పట్టణంలోని నడిబొడ్డున ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి దొంగలు పడి హుండీ పగలగొట్టి డబ్బులను ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయాన్నే ఆలయం తలుపులు తీసేందుకు వెళ్లగా అక్కడ పడి ఉన్న తాళాలను చూసి దొంగతనం జరిగినట్లు గుర్తించి వెంటనే కమిటీ సభ్యులకు తెలియజేశారు. సభ్యులు పోలీసులకు సమాచారాన్ని అందించారు. ఎస్సై విష్ణు నారాయణ ఆలయం వద్దకు చేరుకొని ఆలయంలో ఉన్న సిసి పుటేజీ ద్వారా నిందితులను కనుగొని గాలింపు చేశారు. అవుకు పట్టణానికి చెందిన షేక్షావలిని నిందితుడిని గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న రూ. 6100 స్వాధీనం చేసుకొని ఆలయం కమిటీ సభ్యులకు అప్పజెప్పారు. నిందితుడు షేక్షావలిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేవలం మూడు గంటల వ్యవధిలోనే నిందితుడిని గుర్తించి సొమ్ము రికవరీ చేసినందుకు పట్టణంలోని ప్రజలు ఎస్ఐకి అభినందనలు తెలియజేశారు.

కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ఆత్మకూరు : ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బుధవారం మెగా రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఆసియా మారుఫ్, వైసిపి పట్టణ అధ్యక్షులు అధ్యక్షులు సయ్యద్ మీర్‌లు ఈ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. రక్తదానం వేరొకరి ప్రాణాలు నిలుపుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ రాయుడు, కళాశాల ప్రిన్సిపల్ వెంకట నరసయ్య, పద్మావతి, కౌన్సిలర్ రంగస్వామి, వైద్యులు, రక్తదాతలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా

బాలికల సంరక్షణ అందరి బాధ్యత : ఐసిడిఎస్ పిడి

ప్రజాశక్తి - చాగలమర్రి

బాలికల సంరక్షణ కోసం విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలని ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారిని నిర్మల అన్నారు. బుధవారం చాగలమర్రిలోని కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ సంస్థ అక్టోబర్ 11వ తేదీని ప్రపంచ బాలికల దినోత్సవంగా గుర్తించిందన్నారు. కావున ప్రతి ఒక్కరూ బాలికల సంరక్షణ కోసం, అన్ని రంగాలలో బాలికలను గుర్తించి అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో కస్తూర్బా గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ సునీత అంగన్వాడి ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్ రషీధాబేగం, అంగన్వాడి కార్యకర్తలు, జిఎంఎస్‌కేలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల :** స్థానిక శ్రీ రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి రామకృష్ణ రెడ్డి, ఎస్టేట్ మ్యానేజర్ ప్రగతి హాజరయ్యారు. ఈ సందర్భంగా జి. రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో బాలికల పరిస్థితులు, సమాజంలో వారు పోషించే పాత్రల గురించి వివరించారు. బాలికల అవసరం సమాజానికి ఎంతో ఉందని, వారిని చదివిస్తే ఎందరో గొప్పవారిగా తీర్చిదిద్దబడతారని తెలిపారు. ఎన్సిసి క్యాడేట్స్, బాలికలు పడుతున్న కష్టాలపై నృత్యాన్ని చక్కగా ప్రదర్శించారు.

మాట్లాడుతున్న ఐసిడిఎస్ ప్రాజెక్టు జిల్లా అధికారిని నిర్మల

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : జిల్లా పరిషత్ చైర్మన్

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. బుధవారం కొలిమిగుండ్లలోని రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ శనగ విత్తనాలను పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సబ్సిడీ విత్తనాలతో పాటు రైతులకు గిట్టుబాటు ధర అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు 28 వేల క్వింటాలు మంజూరయితే కోవెలకుంట్ల డివిజన్లోని ఆరు మండలాలకు 15 వేల క్వింటాలు మంజూరయినట్లు చెప్పారు. కొలిమిగుండ్ల మండలానికి శనగ విత్తనాలు 2125 క్వింటాలను మంజూరయ్యాయని, అవసరమైతే శనగ విత్తనాలు మరికొన్ని క్వింటాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో డిఎఒ మధుసూదన్ రావు, ఎడి సుధాకర్, వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, పేరం సత్యాల్ రెడ్డి, లాయర్ మహేశ్వర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచి ఈశ్వరయ్య, నందిపాడు గురివిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి జ్యోతి, తహశీల్దార్ ధోని ఆల్ ఫ్రెండ్, ఎంపీడీవో జీవీ ప్రసాద్ రెడ్డి, ఎంపిటిసి వెంకటరమణ, పెద్దవెంతుర్ల వెంకటేశ్వర్ రెడ్డి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

దూదేకుల సింహ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

29న దూదేకుల సింహగర్జన

విజయవంతం చేయండి : దూదేకుల ఫెడరేషన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : చట్టసభల్లో దూదేకుల వారికి స్థానం కల్పించాలనే లక్ష్యంతో ఈ నెల 29న గుంటూరులో జరిగే దూదేకుల సింహగర్జనను విజయవంతం చేయాలని దుదేకుల ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ డి. బాబాన్ కోరారు. బుధవారం స్థానిక నూరు నర్సింగ్ హోమ్ ఆవరణంలో దూదేకుల సింహగర్జన సభను విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముందుగా సింహగర్జన పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాల అయినప్పటికీ ఇంతవరకు దూదేకుల వారు ఉమ్మడి రాష్ట్రంలో ఎవరు కూడా చట్టసభలలో ప్రవేశించలేదని, ఈసారి దూదేకుల వారికి చట్ట సభల్లో అవకాశం కల్పించిన పార్టీలకు మద్దతు ఇస్తామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలుకనీసం రెండు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి దస్తగిరి పర్ల, జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ మహ్మద్ హుస్సేన్, అధ్యక్షులు దస్తగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ క్రాంతి, ప్రధాన కార్యదర్శి గోల్డ్ దస్తగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీస్ హుస్సేనప్ప , బాలు, నాయకులు వాసవి దస్తగిరి, ఆదాం సాహెబ్, సోమశేఖర్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

19న పండ్ల తోటల రైతుల రాష్ట్ర సదస్సు

- జయప్రదం చేయండి : ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి - బేతంచర్ల

అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈనెల 19న జరుగు పండ్ల తోటల రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.సుబ్బరాయుడు, బేతంచెర్ల మండల ప్రధాన కార్యదర్శి పి.రామ మోహన్‌లు పండ్ల తోటల రైతులను కోరారు. బుధవారం స్థానిక ఎపి రైతు సంఘం కార్యాలయంలో మండల నాయకులు కె.మద్దిలేటి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సందర్భంగా వారు మాట్లాడుతూ పండ్ల తోటల రైతులను ఐక్యం చేసేందుకు, పండ్ల తోటల రైతులకు అండగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 19న తాడిపత్రి పట్టణంలోని ప్రియతమ ఫంక్షన్ హాలులో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎపి వ్యకాసం జిల్లా నాయకులు ఆర్.ఈశ్వరయ్య, రైతులు సీతారాంపురం బి.మధు, కుమ్మరి అయ్యస్వాములు, షేక్.మాబు వలి, డి.అర్.మనోహర్, మద్దిలేటి, శేషన్న, పుల్లారెడ్డి, పక్కిరప్ప, గోపాల్ రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - ప్యాపిలి

మండలంలోని రాచర్ల గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని మల్లేశ్వరి రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైంది. బుధవారం పాఠశాలలో విద్యార్థిని, నివ్యాయామ ఉపాధ్యాయుడు అశోక్ రెడ్డిని ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి అభినందించారు. ఉపాధ్యాయులు శేషయ్య, జీవలత, ఫరిదా, హరిత, జయతులశమ్మ లక్ష్మీ నాయక్, వేణుగోపాల్ రెడ్డి, మహేశ్వరి,షకిల, ప్రకాష్ బాబు, జయలక్ష్మిలు విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

ఆరోగ్య సంరక్షణ అందరి బాధ్యత : ఎమ్మెల్యే

అవుకు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - అవుకు

ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బనగానపల్లె శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి అన్నారు. బుధవారం అవుకు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప్పలపాడు ప్రాథమిక వైద్యులు డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ యమునా ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డిలు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, తాసిల్దార్ వెంకటేశ్వర్లు, కాటసాని తిరుపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ చల్లా రఘునాథరెడ్డి, మాజీ సర్పంచ్ దుగ్గిరెడ్డి రవీంద్రారెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జయచంద్ర రెడ్డి , సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** గ్రామీణ ప్రాంతాల పేద ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే తోగురు ఆర్థర్, డిప్యూటీ డిఎంహెచ్వో కాంతారావు నాయక్ అన్నారు. మండలంలోని నందికుంట గ్రామం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణంలో గ్రామ సర్పంచి నిత్య లక్ష్మీదేవి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అవ్వ తాతలతో ముచ్చటించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహారం స్టాల్స్‌ను పరిశీలించారు. ఎంపీడీవో మేరీ, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, జడ్పిటిసి సోమల సుధాకర్ రెడ్డి, జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం అధికారులు జగదీష్ చంద్ర రెడ్డి, రఘురాం, నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్ధన్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, వైద్యాధికారులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** చాగలమర్రి పట్టణంలోని ఒకటవ సచివాలయ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిపి వీరభద్రుడు, సర్పంచి తులశమ్మ, ఉప సర్పంచ్ సోహేల్, తహసీల్దారు సుభద్రమ్మ, ఎంపీడీవో మహబూబ్ దౌలా, ఈఓఆర్డి సుదర్శన్ రావు, వైస్ ఎంపిపి రఫి, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, వార్డు సభ్యులు ఖాజాబీ, షబ్బీర్, సిహెచ్ఓ రమణమ్మ, హెల్త్‌ఎడ్యుకేటర్ వెంకటమ్మ, సూపర్‌వైజర్‌లు లింగారెడ్డి, సీతారాముడు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నర్గిధాబేగం, సిబ్బంది పాల్గొన్నారు. **పాములపాడు :** మండలంలోని మిట్ట కందాల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆర్థర్ పరిశీలించారు. బిపి రక్త పరీక్షల కౌంటర్లను ఓపి కౌంటర్లు పరిశీలించి ఎంతమంది ఓపి వచ్చారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహార ప్రదర్శనను సందర్శించి వంటకాలను తిని చూశారు. డిప్యూటీ డిఎంహెచ్ఓ కాంతారావు నాయక్, ఎంపీడీవో గోపికృష్ణ, డిప్యూటీ తాసిల్దార్ పఠాన్ బాబు, సర్పంచు చింతల నారాయణ, ఎంపిటిసి మూర్తి జాబి, ఈఓఆర్డి శ్రీనివాసులు నాయుడు, వైసిపి మండల నాయకులు రమణారెడ్డి, భీమశేఖర్, రఘురామిరెడ్డి, డైరెక్టర్ రామసుబ్బయ్య బాల ఈశ్వర్ రెడ్డి, రాజన్న, మాలిక్ తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ:** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎంపీడీవో మహబూబ్ ఖాన్, తాహసిల్దార్ హరినాథ్ రావు అన్నారు. మండలంలోని పెద్ద కందుకూరు గ్రామంలో గ్రామ సచివాలయ సెక్రటరీ రామకృష్ణ అధ్యక్షతన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు అమూల్య, విజయలక్ష్మి, వరలక్ష్మి, జయమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారంతో కూడిన శిబిరాలు ఆకర్షణగా నిలిచాయి. **నంద్యాల రూరల్ :** నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామంలో సర్పంచ్ రావణమ్మ, విస్తరణ అధికారి మహీధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మంజూష ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సిద్ధం శివరాం పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఆరోగ్యమ్మ, సిహెచ్‌ఒలు, ఆశాలు, వాలంటీర్లు పాల్గొన్నారు. **రుద్రవరం :** మండలంలోని పేరూరు గ్రామంలో సర్పంచ్ దేవదానం ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. వైద్య శిబిరంలో ఏర్పాటుచేసిన ఓపి మందులు తదితర కౌంటర్లను హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య పరిశీలించారు. ఎంపీడీవో మధుసూదనరెడ్డి, తహశీల్దార్ రవీంద్ర ప్రసాద్, ప్రజా ప్రతినిధులు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** మండలంలోని చిన్నదేవలాపురం గ్రామంలో సర్పంచ్ ఆవులపాటి మధుసూధన చౌదరి అధ్యక్షత జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి వైసిపి శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్ప భువనేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైసిపి నాయకులు శాఖమూరి సుబ్బారెడ్డి, డిష్ శీను, డాక్టర్ కిరణ్ కుమార్, ఎంపీడీవో వాసుదేవగుప్త, తాసిల్దార్ రవికుమార్, వైద్యారోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** మండలంలోని గుటుపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచి శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి మాట్లాడారు. వైస్ ఎంపిపి రంగస్వామి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ సభ్యులు మూర్తుజావలి, గూని నాగరాజు, కోడే వెంకటేశ్వర్లు, రామానాయుడు, బీరేలి నాగేశ్వర్ రెడ్డి, రాజు పాల్గొన్నారు.

కొత్తపల్లి: వృద్ధురాలికి కంటి అద్దాలు పెడుతున్న ఎమ్మెల్యే ఆర్థర్

ఆళ్లగడ్డలో.. అంగన్వాడి కార్యకర్తల స్టాల్ను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

బిసిలకు పెద్దపీట వేసిన ఘనత చంద్రబాబుదే

- మాజీ మంత్రి అఖిల ప్రియ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

బిసిలకు పెద్దపీట వేసిన ఘనత ఘనత మాజీ మంత్రి చంద్రబాబుకే దక్కుతుందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆళ్లగడ్డలో 30వ రోజు రిలే నిరాహార దీక్షలు బుధవరం కొనసాగాయి. పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు సల్లా నాగరాజు ఆధ్వర్యంలో బీసీ సెల్ నాయకులు దీక్షలో పాల్గొన్నారు. వీరికి సంఘీభావంగా భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బాలచంద్రుడు, ఆళ్లగడ్డ బీసీ సెల్ నాయకులు నాగేశ్వరరావు, లింగమయ్య, దూదేకుల మస్తాన్, గుర్రప్ప, పుల్లయ్య, శ్రీనివాసులు, లింగమయ్య, గౌడ్, రమేష్, ఓబులేసు, యువరాజు తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు పట్టణంలో 29వ రోజు రిలే నిరాహారదీక్ష కొనసాగింది. దీక్షలో అమలాపురం గోకారి, జి.సి పాలెం లింగా రెడ్డి, రామ నాయుడు, చికెన్ అబ్దుల్, బాబీ, పరమేష్, శ్రీనివాసులు, లింగా స్వామి, శివారెడ్డి, నారాయణ రెడ్డి, ముర్తుజ తదితరులు పాల్గొన్నారు. శ్రీశైల నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగ రెడ్డి, శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ శివరామిరెడ్డి, కంచర్ల సురేష్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వేణు గోపాల్, మండల అధ్యక్షుడు శివ ప్రసాద్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, రమేష్ గౌడ్, మల్లికార్జున రెడ్డి, జాకీర్, న్యామతుల్లా, గౌస్, రాముర్తి, రవీంద్రా బాబు, రామ నర్సయ్య, మహబూబ్, నాగేశ్వర రావు, బుగ్గ రాముడు తదితరులు సంఘీభావం తెలిపారు. **నందికొట్కూరు :** నందికొట్కూరు పట్టణంలోని మున్సిపాలిటీ 22వ వార్డు ఏబీఎం పాలెం కాలనీలో టిడిపి నాయకుల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వార్డు ఇన్చార్జులు కళాకర్, నిమ్మకాయల రాజు, బి.రాజన్న ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి చంద్రబాబునాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ప్రవీణ్, ప్రేమ్, పుష్ప రాజ్, తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ప్రజాక్షేత్రంలో ఎదుర్కొనలేకనే అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని టిడిపి నియోజకవర్గ పరిశీలకులు బాజీ చౌదరి పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ నిరసిస్తూ పట్టణంలోని తెలుగు పేటలో ఆయన ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తూ బాబుకు అండగా నిలవాలంటూ ప్రచారం నిర్వహించారు. అనంతరం బాబుతో నేను అనే రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, ఎంపిటిసి జక్కు కిష్టన్న వార్డు మెంబరు హరికృష్ణ, నాయకులు రామాంజనేయులు, కృష్ణమూర్తి, సురేష్, పుల్లయ్య, జబ్బార్ పాల్గొన్నారు. **బేతంచెర్ల :** బేతంచర్లలోని 5వ వార్డులో పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి ఆధ్వర్యంలో బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో అవినీతి పరిపాలనకు ఓటుతో బుద్ధి చెప్పాలని ఆయన ప్రజలను కోరారు. కౌన్సిలర్ రాంగోపాల్, రమేష్ రెడ్డి, నంద్యాల మధు, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, పట్టణ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లోకేష్ గౌడ్, మాదినేని నారాయణస్వామి, మల్లిపెద్ది నాగేశ్వర్ రెడ్డి, మధు లోకేష్ రెడ్డి, కానాల అంజి పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : మాట్లాడుతున్న అఖిలప్రియ

బనగానపల్లె : కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

బేతంచెర్ల : కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

శరన్నవరాత్రుల పుస్తకం విడుదల

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో దసర ఉత్సవాలను పురష్కరించుకొని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దసర శరన్నవరాత్రుల పుస్తకాలను ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ముడియం నరసింహారావు ఆధ్వర్యంలో బుధవారం విడుదల చేశారు. ఆర్య వైశ్య సంఘం ఉపాధ్యక్షులు ముడియం కృష్ణమూర్తి, కార్యదర్సి బాలకృష్ణ, ఉప కార్యదర్శి మద్దిలేటయ్య, కోశాధికారి మాదవ నరసింహయ్య పాల్గొన్నారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

ఐ.పి నెంబర్ 46/2023

ఎం.శ్రీనివాసులు. ...అర్జీదారు

ఎదురి

వంగల భాస్కర్ రెడ్డి వగైరా. ...రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

నంద్యాల జిల్లా, ఆత్మకూరు తాలూకా, ఆత్మకూరు గ్రామ ప్రజలకు తెలియజేయడమేమనగా పై నెంబర్ ఐ.పిలో అర్జీదారు అయిన ఎం.శ్రీనివాసులు తండ్రి ఎం.వెంకట శివుడు ప్లాట్ నెంబర్ 205, ఎస్.ఎల్.వి.హైట్స్, సంతోష్ నగర్, కర్నూల్ సిటీ అనునాతుడు తనను దివాళా దారుగా తీర్మానించమని కోరుతూ పైకోర్టులో దివాళా అర్జీ దాఖలు చేసినాడు. ఇందులో ఎవరికైనా ఆక్షేపణ ఉన్నా 9 /11/2023వ తేదీ పగలు 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వులు మేరకు

సి.వి.రామప్రసాద్,

కె.విజయలక్ష్మి,

అర్జీదారు పరం అడ్వకేట్లు,

కర్నూలు.